
కాలజ్ఞానసుధ
ఆధ్యాత్మిక మాస పత్రిక

జూన్- 2015 సంపుటి:19 సంచిక:6



**ఈ నెల సూక్తి**

అధిక వెలుగును భరించలేవు. చిమ్మచీకటిలో బ్రతుకనూ లేవు. జీవితంలో సుఖదుఃఖాలు కూడా అంతే నసుకో! నిన్ను నీవు తీర్చిదిద్దు కునేంత గొప్పగా ఇతరులెవరూ నిన్ను మార్చలేరు.



# విషయ సూచిక

| | |
|---|---|
| సంపాదకీయం - ఏరువాక పూర్ణిమ | 4 |
| అజాత శత్రువు | 5 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (వర్ణధర్మములు) | 8 |
| వీరకాళికాంబా శతకం - తత్త్వసిద్ధి | 10 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 13 |
| యోగవాసిష్ఠ కథాలహరి - అన్నదమ్ముల అనుబంధం | 17 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 19 |
| జగచ్చిత్రం | 21 |
| శ్రీరామ భక్తి ( నారదుని శ్రీరామభక్తి) | 22 |
| రఘువంశం | 25 |
| మహాభారతంలోని నీతి కథలు | 29 |
| త్రివేణీ సంగమం | 30 |
| దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు (వేములవాడ) | 32 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 34 |
| వాస్తు - సైన్సు | 35 |
| వార్తాసుధ | 36 |

ముఖచిత్రం : రాధాకృష్ణులు

**చందా వివరములు**

జీవిత చందా(20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-

చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# ఏరువాక పూర్ణిమ

ఏరువాక పూర్ణిమ రైతుల పండుగ ఏరువాక సాగారోరన్నో చిన్నన్నా.... అంటూ ఆడుతూ, పాడుతూ... ఇంటిల్లపాది అందరూ తలస్నానం చేసి కుడుములు, ఉండ్రాళ్ళు చేస్తారు. పశువులకు ముఖ్యంగా వ్యవసాయం చేసే పశువులకు అనగా ఎడ్లు, ఎనుబోతులకు స్నానం చేయిస్తారు. వాటికి కుంకుమచల్లి మెడలో వెంట్రుకల తాళ్లు, మెడపట్టెలకు కొత్త గంటలు మొదలగు వాటితో చక్కగా అలంకరిస్తారు. వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేస్తారు. పౌర్ణమి రోజున వ్యవసాయం మొదలెట్టడానికి ప్రత్యేకంగా ముహూర్తం అవసరం లేదని రైతులు చెబుతుంటారు. పొలంరి వెళ్ళి అరక కట్టి పని ప్రారంభిస్తారు.

అలా పొలం పనులు ప్రారంభించి ఇంటిల్లపాది ఆనందంగా గడుపుతారు. రోజు సకాలంలో వర్షాలు కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా వస్తాయని, రావాలని భగవంతుని ప్రార్థిస్తారు. అరకకట్టబోయేముందు నేలతల్లికి పూజచేసి ఉండ్రాళ్లు, కుడుములను అచ్చట నుంచి భూమాతకు నైవేద్యం పెడతారు. అమ్మా మాకీ సంవత్సరం పాడిపంటలను సమృద్ధిగా ప్రసాదించు. మా పశుసంపదలను కాపాడు. మా కుటుంబాన్ని ఆనందంగా ముందుకు సాగించు అని ప్రార్థిస్తారు.

అలా పొలం పనులు ప్రారంభించి సంవత్సర మొత్తం తమకు అన్ని విధాల అనుకూలంగా వుండాలని ఆశిస్తూ వారి వారి పనులలో నిమగ్నమై ముందుకు సాగుతారు రైతులు.

అలా వారు పండించిన పాడి పంటలే మిగతా అని వృతుల, ప్రవృత్తుల వారికి ఆహారం ఆధారంకూడాను. అలాంటి రైతు సుభిక్షంగా వుంటే మనమందరం సుభిక్షంగా వున్నట్లే, రైతే రాజన్న మన సాంప్రదాయ వాక్యం ఎప్పటికీ సత్యమే! అలాంటి రైతు ఎల్లవేళలా ఆనందంగా వుండాలని మన మందరం కోరుకోవాలి.

మనదేశం ధాన్యాగారం కావాలి. కరువు, కాటకాలు పలాయనం చిత్తగించాలి. ప్రకృతిమాత కరుణాకటాక్షాలతో హరిత విప్లవం సాధించాలి. భారతమాతకు ధాన్యరాసులతో అభిషేకించాలి. అందుకు ఆ విశ్వవిరాట్ భగవానుని దివ్యానుగ్రహం సర్వదా సంప్రాప్తించాలని ప్రార్థిస్తూ...

తేది 2-6-2015 ఏరువాక పూర్ణిమ సందర్భముగా...!

# అజాత శత్రువు

....... జి.వి. శేషారెడ్డి

ఆలోచనలకు విశ్లేషణ జోడిస్తే అంతులేని అవగాహన. అవగాహన ఏర్పడితే అంతర్ముఖత్వం ఏర్పడుతుంది. అంతర్ముఖి ఎపుడూ కూడా సదాసుకి. విశాలతత్వాన్ని అలవరచుకుంటే అంతా మిత్రత్వమే. సంకుచితత్వాన్ని ఆహ్వానిస్తే అంతా శత్రుత్వమే. సకారాత్మకత సమరాన్ని అలవోకగా స్వర్గాన్ని తలపించే సందిత్వాన్ని ఆహ్వానిస్తుంది. అహింసే కదా అంతరుమ్ముఖత్వం, అమరత్వం. అహింసలో బుద్ధశత్రుతత్వాన్ని తత్వంగా మార్చి మనసులో దాగివున్న ప్రేమ, జాతి, కరుణలను నిద్రలేపి శాంతిసామ్రాజ్యానికి బాట వేయవచ్చుకదా! ఈ విషయాన్ని చరిత్ర తెలుపుతుందో మానవజీవితము నీటిబుడగ అని తెలుసు. ఎపుడు చితుకుతుందో వానరాకడ ప్రాణం పోకడ అన్నట్లు ఎవరికి తెలియదన్నది నగ్నసత్యం. "నా"లో స్వార్థం "మనలో" మనందరితత్వం అన్న విశాలతత్వం దాగి వుంది. స్వార్థాన్ని విడనాడితే "నానాటిబతుకు నాటకమన్న" విషయము అర్థమవుతుంది. మానవజన్మ సార్థకతకు మంర్ర ఏదో అవగతమవుతుంది. శోధన, పరిశోధన అవసరము లేని జ్ఞాన, విజ్ఞాన ప్రపంచములో వున్నాం. మహానుభవులెందరో శోధించి, పరిశోదించి, పరిశీలనాత్మకంగా ఎన్నెన్నో నగ్నసత్యాలను ఈ జగత్తుకు విదితము చేశారు. అనుభవాన్ని రంగరించి ఏది శత్రుత్వము, ఏది మిత్రత్వము, ఏది ధర్మఉ, ఏది అధర్మఉ, ఏది నీతి, ఏది వినీత ఏదారిలో వెళ్ళితే మానవజన్మను సార్ధకము చేసుకొంటావు. అజాతశత్రువుగా మారిపోతావు న్న విషయాలను అరటిపండు వచంఇ చేతికిచ్చినట్లు మనకు ఉద్భోదించచారు. వాటిని ఆస్వాదించటమే మన కర్తవ్యము. "ఆలస్యము అమృతం విషం" "చేతులు కాలిన తర్వాత ఆకులు పటుట్టకోవడం అవివేకం". ఎంతో వివేకాన్ని కలిగివున్న మనిషి అంతర్ముఖిగా మారిపోతే అజాతశత్రువుగా మారి ప్రేమ చక్రవర్తిగా కీర్తింపపడతాడు. హింసను విడనాడితే అంతా మిత్రత్వవేం, అన్న విషయాన్ని అవగతం చేసుకొంటాడు. ధర్మం అనేది సిద్ధాంతాల మీద క్రోడీకరింపబడుతుంది. సంస్కృతి, సంప్రదాయాలు, సిద్ధాంతాలకు మూలం. ధర్మనిరతి, సత్యవ్రతము, సేవాదృక్పథము కలిగి వున్నప్పుడు ప్రతి మానవుని మది ప్రేమ, అమింసలలో నిండి నిండుకుండలాగా తోణకు బెణుకు లేక స్థిత ప్రజ్ఞతను కలిగి అంతా మిత్రత్వాన్ని కోరుకుంటుంది. మంచి అలవాట్లు మనిషిని ఋషిగా మార్చుతాయి. మమానుభావులను ఆదర్శముగా తీసుకొని అరిషడ్వార్గాలను త్యజిస్తే ప్రేమ సామ్రాజ్యాన్ని అజాత శత్రువుగా అలరారుతారు కదా! సృష్టి అంతా ప్రేమమయము, అహింసకు ఆలవాలం. పరిస్థితులను బట్టి ధర్మము మారుతుందన్న విషయము అందరికీ విదితవే. యుద్ధములో శత్రువును సంహరించ నపుడు వీరుడు, శూరుడు అని కీర్తింపబడతాడు. అదే నిజ జీవితములో ఒక మనిషిని సంహరిస్తే హత్య అని నేరస్థుడుగా నిర్దారించి చట్టపరిధిలో జైలుకు పంపుతాము. పరాక్రమము, శౌర్యము అవసరము. ధైర్యం లేని తనం బలమీనం, మరణంలో సమానం అంటారు స్వామి వివేకానందులవారు. ఇది నిజమేకదా. ధైర్యము, పరాక్రమము కావాలి నిన్ను నీవు జయించుకోవడానికి, ఆత్మస్థైర్యము లేని మనిషి దేన్నీ సాధించలేడు. క్రమశిక్షణ, అంకితభావం, ధృడనిశ్చయం కలిగిన మానవుడు గమ్యాన్ని సులువుగా చేరుకోగలుగుతాడు. అశోకచక్రవర్తి చండ అశోకుడి నుండి ధర్మ

అశోకుడుగా మారడానికి అంతర్ముఖముగా తనను వేదిస్తున్న శత్రుత్వ వైఖరిని పోగొటుట్టకొనడానికి బుద్ధత్వాన్ని ఆశ్రయించి అమింసకు పెద్దపేటవేసి ధర్మస్థూపాలను, ధర్మచక్రాలను నిర్మించి ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయుడుగా వినుతికెక్కాడు. అజాతశత్రువుగా మారాడు. ఆదర్మచక్రవర్తిగా ఆదర్శంగా మారాడు. అందరిలో మంచితనాన్ని మాత్రమే చూడగలిగే తత్వమే అమృతత్వము. అపోహలు మనిషిని సంకుచితుడిని చేస్తాయి, శత్రుత్వాన్ని పెంచుతాయి. పోమ నిజాన్ని మరుసుత&ంది. అసత్యానికి అండగా అండగా నిలుస్తుంది. పులికన్నా గిలి చేటుచేస్తుందన్నట్లు, అపోహ, ఈర్ష, అసూయ, ద్వేషాన్ని జయించి అతర్ముఖ అజాతశత్రువుగా మారవచ్చు. మానసిక సంఘర్షణ మనసులో మాలిన్యం ఉన్నపుడు మొదలవుతుందన్నది సత్యము కదా! మలినము లేని మునసుకు ప్రతి అంశాన్ని సకారాత్మకంగానే ఆలోచిస్తుంది, ఆ దిశలోనే పయనిస్తుంది. మిత్రత్వాన్ని పెంచుకొంటు ముందుకు వెళుతుంది. సకారాత్మకతలో శత్రుత్వాన్ని శేషము లేకుండా చేసి మిత్రత్వాన్ని మిగులుస్తుంది. ప్రతి మనిషి మాయతో కష్టపడివుంటాడు. మనిషికి తెలుసు మాయ నిజంకానిది అని! అయినా మాయ భ్రమలో పడడము, ఈగ, తేనే తియ్యగా వుందని తేనెలోపడి చావడం లాంటిది. ఈ బ్రతుకు మాన్నాళ్ల ముచ్చట. నానాటి బ్రతుకు నాటకము అని తెలిసిననాడు శత్రుత్వాన్ని పెంచుకోడు. అజాతశత్రువుగా మారడానికి నిరంతరం కృషి చేస్తాడు. నిరంతర కృషేవలుడు అనితర సాధ్యుడు అనుకొన్న ధ్యేయాన్ని ఛేదించగల సామర్థ్యుడు. రాగ ద్వేషాలుంటే జీవుడు రాగద్వేషాలను జయిస్తే దేవుడు. రాగద్వేషాలను జయించిన మానవుడు ఎంతటి ప్రమాదమొచ్చిన, ఏది పోయినా తోణకడు, బెణకడు. ప్రజ్ఞతను కలిగి అజాతశత్రువుగా అందరి మన్ననలను పొందడం ఖాయం కదా! నాడు కాని, నేడుకాని ఎన్నడైన మానవసంబంధాలను గమనిస్తే మాటతీరు, సంభాషణ నైపుణ్యాన్ని మనిషిని మహోన్నతుడిగా అందలం ఎక్కిస్తుంది అన్నది నగ్నసత్యం. రాజు అజాతశత్రువైతే రాజ్యము శాంతికాముకమై ప్రజారంజకమైన పరిపాలన సాగిస్తాడు. నేడు ప్రజాస్వామ్యంలో ప్రజలచేత ఎన్నుకోబడిన నేత ఏకపక్షపాతి కాకుండా అందరిని సమదృష్టితో చూడకలిగతే అధినేత రామరాజ్యాన్ని తలపించగలడు. లోకకళ్యాణం కోసం ప్రపంచశాంతి కోసం బుద్ధ భగవానుడు "అమింసా పరమో ధర్మతి" అని ప్రబోధించి "బుద్ధం-శరణం-గచ్ఛామి" "సంఘం-శరణం-గచ్ఛామి" అని నమ్మి ప్రపంచలోని ప్రతి మనిషి సంతోషముగా ఉండలన్న ధ్యేయంతో రాజ్యాఇన్న త్యజించి తుచ్ఛమైన ప్రాపంచికాన్ని త్యజించి ప్రపంచములోని ప్రతి ఒక్కరి కోసం ఆనాపానసతిని బోదిచి అంతులేని ఆనందాన్ని అందించి అజాతశత్రువు, అమరుడు అయ్యాడు. ప్రేమ వసుదైకతారక మంత్రం. ప్రేమ అజాతశత్రువు. ప్రేమతయించలేనిది ఏదీలేదన్నది ఋజుసహితం. ప్రేమ నిండిన చోట స్వార్థం, అసూయ, ద్వేషం, సంకుచితత్వం వుండవన్నది నిజం కదా! వసుదైక ప్రేమతో విశ్వంలో దేన్నైనా సాధించవచ్చు. సృష్టి ప్రేమమయం. హింసను భరించదు ఈ సృష్టి స్వాంతనముతోకూడిన కూడలి కావాలి. స్వర్గాన్ని మరిపించాలి. అపుడు శత్రుత్వం మచ్చుకైనా కనిపించదు.

సహనము శత్రుత్వాన్ని మిత్రత్వముగా మార్చుతుంది అని అనటం అతిశయోక్తి కాదు కదా! సమనము సముద్రము కన్నా గొప్పది. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఎంతటి ఉపద్రవము ఎదురైనా ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా సహనము కలిగిన వ్యక్తి సత్యానికి, ధర్మానికి మాత్రమే తలవంచగలడు. దుర్గుణాలైన కోపం, ఆవేశము, ఈర్ష అసూయ, ద్వేషములను సహనము అజాత-శత్రువుగా మార్చుకొంటుంది ప్రేమతో. ప్రేమ కోపాన్ని తగ్గిస్తుంది. క్రోధాన్ని అణచేవేస్తుంది. ఆవేశాన్ని అదుపు చేస్తుంది. ఈర్షను, ద్వేషాన్ని అసూయలను చల్లారుస్తుంది. అందుకే ప్రతి మనిసి ప్రేమను భూషణంగా చేసుకొంటే

అజాత శత్రువు కాలేడా! మానవ సంబంధాలు మెరుగుపరచుకోవడం వల్ల స్నేహ వాతావరణాన్ని పెంపొందించుకోవచ్చును. స్నేహవాతావరణము మిత్రత్వాన్ని పెంచుతుంది. అందరిలో తలో నాలుక అయి నలుగురి మెప్పు తనకు తెలియకుండానే పొందగలడు. నేటి సభ్యసమాజములో మానవసంబంధాలు ప్రముఖపాత్రను పోసిస్తున్నాయి. తన ఉనికిని శాసిస్తున్నాయి. ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. కానీ చెప్పే విధనాములో మార్పులు గమనించి చెప్పాలి. ఎదుటి వ్యక్తిని ఎట్టి పరిస్థితులలో కించపరిచే విదంగా గానీ, తక్కువ చేసి కానీ మాట్లాడడం తగదు. ''నాలుకే పోలికే'' అందువల్ల తాను వ్యక్తీకరించాలనుకున్న విషయాన్ని స్పష్టంగా, విశదంగా ఎదుటివ్యక్తి మనస్తత్వాన్ని గమనించి విశ్లేషిస్తే విజయుడవు నీవే కదా! ఈ విధమైన సంబంధాలను ప్రతి ఒక్కరు తన కుటుంబము నుంచే ప్రారంభించాలి. స్వర్గాన్ని తలపించే ఆనందాన్ని పొందుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకొటాడు. జీవనసాగరంలో ఆటుపోట్లు, ఉపద్రవాలు ఉద్వేగాలు సర్వసాధారణం. న్నింటిని అధిగమించి ముందుకు వెళ్ళడానికి పోరాటపరిమ ఒక్కటే కాదు, ఎలా పోరాటాన్ని సాగించాలో తెలియాలి. అపుడు తాను కురుక్షేత్రయుద్ధంలో భిమన్యుడులాగా చిక్కుల్లోపడడు కదా! అభిమన్యుడు మహవీరుడై లోపలికి వెళ్ళడానికి మాత్రమే తన దగ్గర సమాచారము వుంది. చేధించడానిఞ తన దగ్గర సమాచారము లేదు కనుక హతుడయ్యాడు. ప్రతి మనిషి బాహ్యంగాను, అంతరంగికంగాను అంతరంగికంగాను అజాతశత్రువు కావాలి. అపుడు తాను ఉన్నతస్థానాఞ్ని పొందగలడు. ఇతిమాసాలను, పురాణాలను గమనిస్తే తుచ్ఛమైన కొన్ని కోరికలను జియించలేక తమ తపోశక్తిని నిర్వీర్యము చేసుకొనలేదా! విశ్వామిత్రున లాంటి మహర్షులు దైవం పెట్టిన పరీక్షలలో వీగిపోలేదా! రంభ, ఊర్వశి, మేకలాంటి వారిని పంపి వారి తపోనిష్టను భంగము చేసి సామాన్య మానవులుగా చేయలేదా! అందుకే వారు తమలోనున్న రాక్షసగుణాలను కొన్నింటిని జయించలేక అంతర్ముఖంగా అజాత శత్రువులు కాలేకపోయారు కదా! సముద్రంలో అలలెంత సహజమో, దినానికి రోజు పగలు అంత సహజము. ప్రతి మనిషి జీవిత సాగరంలో కష్టాలు, సుఖాలు అంతే. అజాతశత్రువుగా తయారైతే కష్టాలు, సుఖాలు తనకు సమానమే. అజాత శత్రుత్వంలో స్థైతప్రజ్ఞతను పొంది భగవద్గీతను వినిన తరువాత అర్జునుడు స్థితప్రజ్ఞతను పొంది అర్జునత్వానికి నాంది పలికినట్లు ప్రతి మనిషి అత్యున్నతమైన స్థితికి ఎదిగి స్థితప్రజ్ఞతను పొందగలడు. నీటిలో నిప్పు పడితే ఆరిపోతుంది. ప్రేమ సామ్రాట్, అమింసావాది దగ్గరకు చెడుగుణాల ఎవైనా, ఉదాహరణకు ఒత్తడి, ఆందోళన, అలజడి, ఆవేశము, ఈర్ష, ద్వేషాలు ఇవి ఏవీ కూడా దరికి చేరలేవు. ఎందుకంటే ప్రేమ, అహింసలు అజాతశత్రువులు కనుక అందరికి కలవాడని, సహనము ఆచరణముగా కలవాడని, ప్రేమాభిషిక్తుడని అజాతశత్రువని అనలేమా!

- గద్ద ఎంత ఎత్తుకు ఎగిరినా దాని చూపు నేలపై నున్న నీచ పదార్థాలపైనే ఉంటుంది. అలాగే సంస్కారం లేని మనిషి ఎంత ఎదిగినా అతని ఆలోచనలు అధమ స్థాయిలోనే ఉంటాయి.

- అధిక వెలుగును భరించలేవు. చిమ్మచీకటిలో బ్రతుకనూ లేవు. జీవితంలో సుఖదుఃఖాలు కూడా అంతే ననుకో! నిన్ను నీవు తీర్చిదిద్దు కునేంత గొప్పగా ఇతరులెవరూ నిన్ను మార్చలేరు.

- నియమం లేని జీవితం గట్టులేని చెఱువు లాంటిది. విశేషించి చూపా లంటే విలువైన ఆధారమేదీ అక్కడ కనిపించదు.

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్: 09410990829

## వర్ణధర్మములు

భారతావనిలోని వర్ణవ్యవస్థ వివాదాంశనీయమైనది. ఈ వ్యవస్థను గురించి అనేకమంది మహాపురుషులు, సంఘసంస్కర్తలు వివిధ భేదాభిప్రాయములను కలిగి యుండిరి. ప్రస్తుతము గూడ ఈ సమస్యకు పరిష్కార మార్గము కనిపించుటలేదు. ఈనాటి మన సమాజంలో ఉద్వేగాన్ని చెలరేగిస్తున్న సమస్యలలో ఇది ఒకటి.

ఈ వ్యవస్థను గురించి శ్రుతి, స్మృతి, శాస్త్రములు వ్యక్తపరచిన యథార్థములను తెలిసికొందము.

వివిధ ధర్మములకు భాండాగారమైన మనుస్మృతి వర్ణధర్మములను బోధించునపుడు, వర్ణవిభజన ఏ భూమికనాధారము చేసికొని చేయబడినదో ప్రస్తావించలేదు. భూమికపై మౌనము వహించి, వర్ణధర్మములను మాత్రము బోధించుచున్నది మనుస్మృతి.

బహుశా! మనుమహర్షి ఋగ్వేదములో చెప్పబడిన వర్ణవిభజన నాధారము జేసికొని, ఆయా వర్ణముల యొక్క ధర్మములను నిర్ణయించి ఉండవచ్చును.

ఋగ్వేదము క్రింది విధముగ చెప్పుచున్నది :

**మం॥ బ్రాహ్మణోஉస్య ముఖమాసీద్బాహూ రాజన్యః కృతః।**

**ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత ॥ (ఋ-90.12)**

'భగవానుని ముఖారవిందము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు పాదముల నుండి శూద్రులు ఉద్భవించినారు'.

మనుస్మృతి వర్ణధర్మములను క్రింది విధముగా నుడువుచున్నది.

**శ్లో॥ అధ్యాపన మధ్యయనం యజనం యాజనం తథా।**

**దానం ప్రతిగ్రహం చైవ బ్రాహ్మణానా మకల్పయత్॥ (మను.1.88)**

'వేదాధ్యయనము చేయించుట, వేదాధ్యయనము చేయుట, యజ్ఞము చేయుట, చేయించుట, దానమిచ్చుట, గ్రహించుట బ్రాహ్మణ ధర్మము.

**శ్లో॥ ప్రజానాం రక్షణం దాన మిజ్యాధ్యయన మేవ చ।**

**విషయే ష్వప్రసక్తి శ్చ క్షత్రియస్య సమాసతః॥ (మను. 1.89)**

'ప్రజలను రక్షించుట, దానము చేయుట, యజ్ఞములు చేయుట, వేదాధ్యయనము, విషయాసక్తుడు కాకుండుట క్షత్రియ ధర్మము'.

**శ్లో॥ పశూనాం రక్షణం దాన మిజ్యాధ్యయన మేవ చ।**

**వణిక్పథ కుసీదం చ వైశ్యస్య కృషి మేవ చ॥ ॥ (మను. 1.90)**

'పశువులను పోషించుట, దానమిచ్చుట, యజ్ఞములు చేయుట, వేదాధ్యయనము, వ్యాపారము, వడ్డీకిచ్చిపుచ్చుకొనుట, వ్యవసాయము వైశ్యధర్మము.

**శ్లో॥ ఏకమేవ తు శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్।**

**ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషా మనసూయయా॥ ॥ (మను. 1.91)**

'బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు అసూయా సంకోచములు లేకుండా సేవచేయుట శూద్రధర్మము.

పైనుదహరించిన వ్యవస్థ ప్రకారము మానవుని యొక్క వర్ణమును (జాతిని) పుట్టుకను బట్టి

నిర్ణయించి, ఆపై ఆ వ్యక్తి ఆచరించవలసిన విధ్యుక్తధర్మములను నిర్ణయించడమైనది.

కాని, మనము వేదకాలము నుండి ఈనాటి వరకు మన దేశచరిత్రను కూలం కషముగా పరిశీలించిన యెడల, ఈ వ్యవస్థ నిత్య జీవితములో ఆచరణ యోగ్యముగా ఉన్నట్లు కనిపించుట లేదు. ఎందువలననగా - చరిత్రలో మహా పురుషులుగా ప్రసిద్ధి గాంచినవారే తమ తమ వర్ణధర్మములను ఆచరింపక, విభిన్నముగా ప్రవర్తించినారు.

ఉదాహరణకు, విశ్వామిత్రుడు క్షత్రియుడుగా జన్మించినను ఘోరతపస్సు నాచరించి, సద్బ్రాహ్మణుడయ్యాడు. అంతియేగాక బ్రహ్మర్షిగా ప్రసిద్ధి జెందినాడు. పరశురాముడు, ద్రోణుడు, అశ్వద్ధామ, ఈనాటి చరిత్రలో ఖడ్గతిక్కన బ్రహ్మణులుగా జన్మించినను క్షత్రియుల కుండవలసిన వీరత్వమును, ధీరత్వమును, శూరత్వమును గలిగియుండి యుద్ధములు చేసి, మహాయోధులని వినుతికెక్కినారు. మొన్న మొన్నటి చరిత్రలోని పోతన, శ్రీనాథుడు మొదలగువారు బ్రాహ్మణులుగా జన్మించినను వ్యవసాయము చేసినారు.

కర్ణుడు సూత దంపతుల చేత పెంచబడుటచే శూద్రుడుగా గణింపబడినప్పటికి, ప్రయత్నపూర్వకముగ రాజయ్యాడు. నిమ్నజాతికి చెందిన మత్స్యగంధికి పుట్టిన వ్యాసుడు, తపోబలము వలన జ్ఞానసిద్ధివలన వేద విభజన గావించి వేదవ్యాసుడు గాను, బారతావనిలో జ్ఞానజ్యోతిని వెలిగించి వ్యానమహర్షిగాను ప్రసిద్ధిజెంది, సద్బ్రాహ్మణుడయ్యాడు.

వేదకాలమునాటి సూతమహిర్షి నిమ్నజాతికి చెందినప్పటికి, ఋషులందరిలో జ్ఞానచక్రవర్తిగా గౌరవింపబడి, సద్బ్రాహ్మణుడయ్యాడు. జ్ఞానవిషయములో ఏ శంక ఉద్భవించినప్పటికి ఋషులందరు శంకానివృత్తి కొరకు సూత మహర్షిని సంప్రదించెడి వారట.

కావున, పై నుదాహరించిన ఉదాహరణలను బట్టి చూచిన యెడల, ఒక నగ్నసత్యము గోచరించును - మానవుని చిత్తప్రవృత్తి త్రిగుణత్మకమైనది. సత్త్వరజస్తమో గుణములలో ఏ గుణము ప్రబలమై యుండునో, దానిని బట్టి వ్యక్తి యొక్క స్వభావము యేర్పడును. స్వభావమునననుసరించి అతనియొక్క కర్మాచరణ యుండును. అంతియే గాని పుట్టుకనుబట్టి నిర్ణయింపబడిన కర్మలను ఏ వ్యక్తియు నాచరింపజాలడు. శూద్ర మనస్సుతో పుట్టిన బ్రాహ్మణుడు బ్రాహ్మనధర్మముల నెట్లు నిర్వర్తింపగలడు ?! అటులనే, బ్రాహ్మణ స్వభావముతో పుట్టిన శూద్రుడు శూద్రధర్మముల నెట్లు ఆచరింపగలడు ?!

అందువలన, హేతువాధియై శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో మనువు చెప్పిన వర్ణధర్మములకు వ్యతిరేకముగా తిరగేసి చెప్పినాడు. మనువు ఈ ఈ వర్ణములవారు ఈఈ ధర్మములను ఆచరింపవలయునని చెప్పినాడు. శ్రీకృష్ణపరమాత్మ మానవులు వారి వారి స్వభావములను బట్టి ఈఈ కర్మల నాచరించినవారు ఈఈ వర్ణములకు చెందినవారు అని నిర్ణయించినాడు.

శ్రీకృష్ణపరమాత్మ గీతలో ఇలా నుడివినాడు :

**శ్లో॥ చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః॥**

**(భ.గీ. 4-13)**

**తరువాయి 18వ పేజిలో......**

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందో<sub></sub>నుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లె) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## తత్త్వసిద్ధి

**రెండుగతుల కాన ఖండించి చూడుడీ**
**పండువెన్నెల గతి నిండి యుండు**
**ప్రహరిపట్టి తిరుగువాడెఱుగడు కాన**
**కాళికాంబ! వీరకాళికాంబ! 423**

ఇటునుంచీ అటునుంచీ నరుక్కుంటూ వస్తే అడవి బంగన బయలై పండువెన్నెల విస్తరించినట్లు కనిపిస్తుంది. కానన గర్భంలో ప్రవేశిస్తేకాని కానన గాంభీర్యం తెలియదు. అడవి అంచులు పట్టుకొని అటూ ఇటూ నడిచేవాడికి అరణ్యగాంభీర్యం తెలియదు. ప్రహరి గోడపట్టుకు తిరిగేవాడికి సౌధాంతర్భాగం తెలియదు కదా! లోపలికి చొచ్చుకు వస్తేనే పూర్తిగా తెలుస్తుంది.

**శబ్దమణచి ఆత్మసాధన గావించి**
**గుణగణంబు దాటి గురుతెఱుంగ**
**తప్పుదొరలకుండు, తనరు సంతోషంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 424**

ఆత్మసాధన చేసే యోగి గొంతువిప్పి మాట్లాడ వలసిన పనిలేదు. సత్వరజస్తమోగుణాలు దాటి తప్పుదొర్లకుండా సాధన సాగించాలి. లక్ష్యం తప్పక సిద్ధిస్తుంది. సంతోషం అతని నిండా నిండుతుంది.

**సాక్షి తాను గాడె సమయాసమయముల?**
**కందు మోక్షపదవి కతడె సాక్షి**
**తలపు నిలుపు మతని దాక్షిణ్యలబ్ధికై**
**కాళికాంబ! వీరకాళికాంబ! 425**

'ఇది తగిన సమయం. ఇది తగని సమయం.' అని తెలుసుకోవడానికి సాధకుడే ప్రత్యక్షసాక్షి. మోక్షపదవి అతనికే అందుతుంది. ఆ పదవికి కూడా అతడే సాక్షి. అటువంటి సిద్ధుడైన సాధకుణ్ణి మనస్సులో నిలిపి ధ్యానిస్తే అతడు దయతో మనకూ సాధనపద్ధతి నేర్పుతాడు. ఆ మార్గంలో అనుభవం లేని సాధకులు కూడా అనుభవసిద్ధులై మోక్షఫలం అనుభవించ గలుగుతారు.

**పలుకులోన నున్న తలపు తెల్పగవలె**
**పిన్నపెద్ద తెలియు విధముగాను**
**శిల్పితానుయైన శివునకు తెలియదా?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 426**

మనం మాట్లేడే మాటల్లోని భావం చిన్నవారికీ పెద్దవారికీ - అందరికీ తెలిసేవిధంగా ఉండాలి. పలికేపలుకుల్ని పదిలంగా ఎన్నుకొని పలకాలన్నమాట. నీ మాటల ధోరణి పై నుండి వినే శివునకు కూడా తెలుస్తుంది. ఎందువల్లనంటే మాటలు మలచి మాటాడే నేర్పున్న వాక్శిల్పి ఆ శివుడు. కనుక నీవు పదిలంగా పలకాలి.

**చిత్తమందు మేలు శివునికే తెలియును**
**చవుల తెలియునాకు సక్రమముగ**
**హంస ఉండు చోటు అది కూడ తెలియును**
**కాళికాంబ! వీరకాళికాంబ! 427**

మన అంతరంగమునకు మేలు ఎట్లా జరుగునో భగవంతుడైన శివునకు తెలియును. లౌకిక జీవులమైన మనకు నాలుకకుఏది రుచిగా ఉండునో తెలియును. తియ్యగా ఉన్న ప్రతిదీ మేలుచేస్తుందనుకోరాదు. మేలు

కీళ్లు తెలిసికొని పదార్థాలు సేవించాలి. దీనికి 'హంస' యే మన కాదర్శం. హంస నీరుకలిసిన పాలలో నీటిని వేరుచేసి పాలనే సేవిస్తుంది. దీనిని హంసవిద్య అని కూడా యోగశాస్త్రం పేర్కొంటుంది. అటువంటి హంస విద్య ఎక్కడ ఎట్లా లభిస్తుందో అది కూడా-యోగసాధన శక్తివల్ల తెలుస్తుంది.

**నిముసము నినుగన్న నీఱాయెదోషమ్ము**
**లాకురాలినట్టు లాస లుడిగె**
**సందియములు తీరె సంతసంబు జనించె**
**కాళికాంబ! వీరకాళికాంబ! 428**

భగవత్తత్త్వం తెలుసుకొని తత్త్వ దర్శనం చేసుకొన్న నిమిషంలో జీవుని దోషాలు భస్మమై పోతాయి. 'నీఱు' అంటే బూదిడ అనే అర్థం. జీవుని ఆశలకు అంతుండదు. అవి కూడా ఆకులు రాలినట్లు రాలిపోతాయి. అనుమానాలు తొలగిపోతాయి. ఆనందం కలుగుతుంది. తత్త్వ దర్శనం వల్ల ఇంతటి మహాఫలం ఉంటుంది.

**నిందలేక యుండ నిన్ను నే కనుగొంటి**
**బొందిలేక నింద పొందగలనె?**
**ఎండునే పయోధి యిట్టె నే నీదంగ?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 429**

నేను దేహధర్మం కల లౌకిక జీవిని. ఇటువంటి వారికి నిందలు, నిష్ఠురాలు అనివార్యం. కాని ఓ పరతత్త్వమా! నీ దర్శన సమయంలో మాత్రం నేను నిందలకు దూరమై అనింద్యమైన జీవిని కాగలిగాను. నేను అల్పజీవిని. నీ తత్త్వం మహాసముద్రం వంటిది. ఎంత ఈదినా సముద్రజలం లేని స్థితి ఉండదు గదా! కనుక నేనిట్లా ఈదుకుంటూ పోవలసిందే నీ దర్శనానికి.

**సందు దొరకె మాకు సంతోషముగ రండు**
**నోము ఫలము ముందు నోచియుంటి**
**మతి ముదమ్ము గలిగె నబ్ధిక్షీరాబ్ధిగా**
**కాళికాంబ! వీరకాళికాంబ! 430**

మేము చిరకాలంగా చేస్తున్న నోములు ఫలించాయన్న మాట. అనేకమైన నోములు నోచి ఉన్నాము. మిమ్మల్ని సేవించే అవకాశం మాకు కలిగింది. సంతోషంగా రండి. మా ఆతిథ్యం స్వీకరించండి. మేము ఇంత వరకూ దేన్ని పట్టి ఉప్పునీటి సముద్రమను కుంటున్నామో అది ఇప్పుడు పాలకడలియై నోరూరిస్తున్నది. క్షీరాబ్ధి నారాయణుడు పవ్వళించి ఉండే తావే కదా! మా జన్మ తరించింది. భూమిని భరించే ఆదిశేషునిపై అధివశించి ఉండే లక్ష్మీనారాయణులు కనిపించినంత ఆనందంగా ఉంది.

**వందనమున గురుని వద్ద కూర్చుండగా**
**మధ్యవర్తి తనదు మనసు చూపె**
**మనసు వెంట పోయి కనుగొంటి నమ్మాయ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 431**

అంజలి ఘటించి గురుసన్నిధిలో కూర్చుండి ఉండగా లౌకికుడైన మధ్యవర్తి ఆశలు కల్పించి తన మనస్సు వెంట నన్ను కూడా లాక్కొని పోయాడు. పోయి చూతును గదా! అంతా మాయ. మాయ విచిత్రమైనది. సాంఖ్యుల మూలప్రకృతిగా దేన్ని చెబుతారో అద్వైతులు దాన్నే 'మాయ'గా చెబుతారు. నిర్మలజ్ఞానం లభిస్తేనే మాయ నుండి ముక్తి అని అద్వైతుల అభిప్రాయం.

**కంటి నా మనస్సు కరువెల్ల తీరగా**
**విసము నారగించుట సుళువయ్యె**
**ఆరగింపనోరు అమృతమూరెను గద**
**కాళికాంబ! వీరకాళికాంబ! 432**

'మాయ రూపంగా కనిపించేదంతా పరమాకర్షకం గా ఉంటుంది. దాన్ని కన్నుకరువు దీరా చూచాను.

అది ప్రమాదకరమైన విషమని తెలిసి కూడా నాలుక నదుపు చేసుకోలేక పోతుంటాను. పైగా సుళువుగా ఆ విషాన్ని ఆరగించటం జరిగింది. ఆరగిస్తున్న కొద్దీ నోటిలో అమృతం ఊరటం సాగింది. మాయ మహిమ ఇంత విచిత్రమైనదన్నమాట!

**నిజము గురుని సత్తు నీకెట్లు కనిపించు**
**నోరు అమృతమూరు తీరులేక?**
**మారి చొచ్చుకొంప ఆఅడి మెండాయె**
**కాళికాంబ! వీరకాళికాంబ! 433**

విషమారగించటానికి నోట్లో అమృతమూరే నీకు సత్యస్వరూపుడైన గురుని దర్శించేందుకు నోరూరదు కదా! ఇది కూడా మాయ లక్షణమే. నీ దేహమనే కొంపలో మహామారి ప్రవేశించింది. 'మారి' అంటే మిత్తి కదా! దాని వల్లనే ఆఱడి - అంటే నింద - పెరిగింది. మాయలో చిక్కుకోకుండా సాధకుడు గురుప్రబోధంతో సత్యసందర్శనం చేయాలి.

**యోగి కావలె గద భోగి సంసారి తా**
**సరణి వదలలేక గురు నెఱుగునె?**
**శరణువేడు చోరు నరయుట సులభంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 434**

సంసారపు జంజాటంలో ఉన్న జీవుడు తత్వం తెలుసుకోవాలంటే సంసారం వదలకుండానే - తామరాకుపై నీటిబిందువు వలె రాజయోగి కావాలి. ఈ మార్గం అవలంబించకుండా గురబోధ తెలుసుకోవా లంటే సాధ్యం కాకపోవచ్చు. జీవుని బ్రతుకు ఒక రకంగా దొంగ బ్రతుకే. ఏ మార్గంలేని దొంగ, ఎవరి సొమ్ము తాను హరించాడో ఆ యజమానుణ్ణే శరణు వేడవలసి వస్తుంది. అట్లా శరణువేడే దొంగను గుర్తించటం యజమానికి అసాధ్యం కాదు. పరతత్వం బోధించగల గురువును సంసారియైన జీవుడు శరణువేడితే తప్పక ప్రయోజనం కలుగుతుంది. గురువు పరతత్వం వలెనే దయాపూర్ణుడు కదా! ఇంతటి మహార్థాన్ని వీరబ్రహ్మ గురుదేవుడు సాధకులకు ఉపదేశిస్తున్నాడు.

ఇది తత్వసిద్ధికి దగ్గర దారి. తత్వాలు పంచవింశతి సంఖ్యలో ఉన్నాయనుకొన్నాం. అవ్యక్తము, బుద్ధి, అహంకారం, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు - ఈ ఎనిమిది అష్టప్రకృతులు. చక్షుశ్రోత్రత్వక్కుజిహ్వా ఘ్రాణము లనే జ్ఞానేంద్రియములు, వాక్పాణిపాద పాయూపస్థము లనే కర్మేంద్రియములు, మనస్సు, పృథివ్యప్తేజో వాయురాకాశాలనే పంచభూతాలు - ఈ మొత్తం షోడశ వికారాలు.

అష్టప్రకృతులు, షోడశవికారాలు, పురుషుడు కలిస్తే మొత్తం పంచవింశతి తత్వాలు. ఈ తత్వాల ద్వారా పరాత్పర సందర్శనం చెయ్యగలగడమే తత్వసిద్ధి. దీనికి మార్గాలు ఈ ప్రకరణంలో సూచించబడినాయి.

ఇక వచ్చే ప్రకరణంలో 'తృష్ణాక్షయ' మనే అంశం గూర్చి గురుదేవుడు 15 పద్యాలలో వివరించ బోతున్నాడు. తృష్ణాక్షయ సుఖపరిపోషక లక్షణం కలది మోక్షమే కదా! తెలుసుకొందాం.●

- కొందరు మనకు మాట సాయం చేస్తారు. కొందరు ధనసాయం చేస్తారు. మరికొందరు పదవీసాయం చేస్తారు. ఇంకొందరు విద్యా సాయం చేస్తారు. ఐతే మనకు అవసరమైన అన్ని సాయాలూ అందేది మాత్రం ఒక్క భగవంతుని నుండే!

- నియమం లేని జీవితం గట్టులేని చెఱువు లాంటిది. విశేషించి చూపా లంటే విలువైన ఆధారమేదీ అక్కడ కనిపించదు.

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

### 3. ఆచార్యుల సన్యాస స్వీకారము

ఆర్యాంబ తన పుత్రునికి వివాహం చేసి అందరిలా అతడు కూడా సంసార సుఖాన్ని, ఆనందాన్ని అనుభవిస్తూ వుంటే చూచి సంతోషపడవలెనని ఆశపడ్డది. కాని తన కొడుకు యొక్క అల్పాయుష్షు సంగతి తెలిసి నిరాశచెందింది. శోకతప్త అయింది. అందుకు శంకరులు కన్న మమకారంతో తల్లడిల్లుతున్న తల్లిని చూచి "అమ్మా! నీవు తల్లివని, నేను నీకు పుత్రుడనని మాత్రం తెలుసుకున్నావు. ఇది ఎంతవరకూ సమంజసం ? అన్న దానిని గురించి విచారించు. ఎందుకంటే ఇంతకు మునుపే మన మిద్దరమూ ఎన్నో జన్మలను అనుభవించాము. ఈ ప్రపంచంలో జీవులు పుట్టడం, పోవడం నిత్యమ జరిగేపనే. వెనుకటి జన్మలలో నీవు ఎంత మంది పిల్లలను పెంచి పోషించావో తెలియదు. వాళ్ళెవరూ ఇపడు నీ దగ్గర లేరు. వాళ్ళ దగ్గర నీవు కూడా లేవు. ఇవన్నీ దేహబంధాలు. తండ్రికొడుకు, భార్యభర్తలు మొ॥ కొంత దూరం వరకూ కలిసి ప్రయాణించే ప్రయాణికులు. వీరిలో ఎవరూ శాశ్వతులుకారు. ఈ విప్రయోగంలోనే సంయోగం ముగిసిపోతుంది. కాబట్టి నీవు చింతించకు. నేను కూడా భ్రాంతి పూర్ణమైన ఈ సంసారాన్ని వదలి, సర్వసంగ పరిత్యాగియై సన్యాసి కావలెననుకుంటున్నాను. ఎందుకంటే నాకు ఈ సంసారంలో ఎటాంటి సుఖమూ కనిపించడం లేదు. సన్యాసి స్వీకారానికి నీవు అనుమతించు' అని వేడుకున్నారు. తన ఏకైక పుత్రుడు, ముద్దుబిడ్డ అయిన శంకరుడు చిన్న వయస్సులోనే తండ్రిని పోగొట్టుకొన్నాడు. ఇప్పుడు మళ్ళీ ఎన్నడూ వెనక్కి తిరిగి చూడని సన్యాస దీక్ష స్వీకరించడానికి అనుమతి అడుగుతున్నాడంటే తల్లి హృదయం తల్లడిల్లింది. అంతులేని దుఃఖం కలిగింది. ఆమె తన కొడుకుతో 'పుత్రా! అన్ని ధర్మసూక్ష్మాలు మరియు కర్తవ్యనిష్ఠ తెలిసిన నీవు ఇలా మాట్లాడవచ్చా ? నీవు సన్యాసివైతే నాకు దిక్కెవరు ? నాగతి ఏమిటి ? నీలాంటి పుత్రుని పొందిన నాకు లభించు ఫలమేమిటి ? నీ ప్రవర్తన సరియైనదేనా ? మరొక్కసారి ఆలోచించుకో" అన్నది. ఆచార్యులు ఒకవైపు తల్లి మనసు నొప్పించలేక మరోవైపు ముగిసిపోతున్న ఆయుష్షులోనే బ్రహ్మసంసిద్ధిని పొందాలన్న సంకల్పాన్నీ విడువలేక కొన్నాళ్ళు చింతాక్రాంతులయ్యారు.

**మనసుంటే మార్గం :**

'యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్' అని పెద్దలు చెప్పారు. 'ఏ రోజు, ఏక్షణంలో విరక్తి కలిగినా వెంటనే సన్యాసం స్వీకరించాలి. అన్నది దాని అర్థం ఆచార్యులకు మాతృసేవ కర్తవ్యమైందో అలాగే కర్తవ్యాలను పూర్తి చేయదలచినవారు కొంత ఆలస్యంగా దీక్ష వహిస్తారు. కాని సన్యాస దీక్షకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకున్నారు. చిత్త చాంచల్యం లేక వైరాగ్య భావనను చక్కగా కాపాడుకోవాలి.

సమయం కలసి వచ్చినప్పుడు సన్యాసదీక్షను వహించాలి. ఆచార్యులు కూడ తమలోని వైరాగ్యభావాన్ని గురించి అప్పుడప్పుడు తల్లికి వివరిస్తూ ఆమె అనుమతి కోసం నిరీక్షిస్తూ వున్నారు. ఒకసారి నదీస్నానానికి వెళ్ళినప్పుడు అనిరీక్షితంగా ఒక మొసలి ఆయన కాలు పట్టుకుంది. వెంటనే తల్లికోసం గావుకేక పెట్టారు. పరుగెత్తి వచ్చిన తల్లి కొడుకును ఆస్థితిలో చూచి ఏమీ తోచక నిశ్చేష్ట అయి నిలబడిపోయింది. అప్పుడు ఆచార్యులు 'అమ్మా!, నేను సన్యాసి అయితే మాత్రం ఈ మొసలి నన్ను వదలిపెడుతుంది. వెంటనే సన్యాసదీక్షకు అనుమతినివ్వు' అని ప్రార్థించారు. 'కన్నతల్లి ప్రేమ ఘనమైన ప్రేమ' కదా! ఎక్కడున్నా కొడుకు క్షేమం కోరే ఆ తల్లి నాకొడుకు సన్యాసి అయినప్పటికీ సుఖంగా వుంటే అదే పదివేలు 'ఆ బిడ్డ మొసలి పాలు కాకూడదు' అని భావించి తన సంపూర్ణ అనుమతినిచ్చింది. అప్పుడా మొసలి కాలు వదలింది. ఆయన నది ఒడ్డుకు వచ్చి తల్లికి నమస్కరించారు ఇలా భవసాగరాన్ని వదలి, ఆనందసాగరం వైపుకు ప్రయాణం సాగించారు. అదొక అద్భుత ఘటన అని అక్కడున్న వారందరూ విశ్లేషించారు. ఆచార్యులు కూడా సంసారమనే మొసలి నోటి నుండి ముక్తి దొరికినందుకు మనసా ఆనందించాడు.

సన్యాస ధర్మంలోని సారాంశం 'అభయదక్షిణ' తాను ఎవరికీ ఎప్పుడూ భయాన్ని కలిగించలేదు. ఎవరినీ హిసించలేదు. అదే అభయ ప్రదానం. దీనిని హృదయంగమం చేసుకున్నవాడికి లోకం సుభిక్షంగా, ప్రజలంతా మిత్రుల్లా కనిపిస్తారు. 'యద్భావం తద్భవతి' అంటే అదే కదా! ఎవరి వలన లోకహాని జరుగదో, అలాగే లోకం వల్ల ఎవరికి హాని జరుగదో అలాంటివాడు దైవానికి ప్రీతి పాత్రుడవుతాడు. సర్వకర్మ సన్యాసి కూడా అవుతాడు. అలాంటి వారికి అందరూ 'ఆత్మల్లాగా కనబడతారు. 'మొసలి దుష్టప్రాణి. అది మానవుడికి శత్రువు.' అన్న భావం గలవానిని అది తప్పకుండా హింసిస్తుంది. అలాకాక మొసలిలో వుండే ఆత్మచైతన్యమే తనలో కూడా వుందని భావించేవారికి మొసలి శత్రువెలా అవుతుంది ? ఏమీ తెలియని ఉయ్యాలలోని పాప ఏ భయమూలేక పామును ముట్టుకుంటే అది కాటు వేయదు. ఆ చిన్నారితోపాటు అదికూడా పడగవిప్పి ఆనందంగా ఆడుకుంటుంది. కాని అది కాటేస్తుంది. మన శత్రువు అని భావించే వారికి అది శత్రువే. అందుకే ఆచార్యులు మొసలిలోని ఆత్మతత్వాన్ని గుర్తించి సన్యాస దీక్షలోని స్నేహ భావాన్ని చూపారు. తల్లి అనుమతి దొరకగానే ఆచార్యులు నీటిలోనే నిలబడి 'సన్యస్తం వయా' అని గట్టిగా ఉచ్చరించి తన కోరికను తీర్చుకున్నారు. అలా దివ్య సంకల్పం తన ప్రణాళికను ప్రారంభించింది.

**మాతృదేవతకు వచన ప్రదానం :**

ఆచార్యులు తల్లిని అంగీకరింపచేసి సన్యాస దీక్ష తీసుకున్నారు. ఇక ముందు చేయవలసిన కార్యాక్రమం ఏమిటి ? అని ఆలోచించసాగారు. అలా ఆలోచించే కొడుకును చూచిన తల్లి 'బాబూ! నీవు మొసలినోటి నుండి బయటపడితే చాలునని నేను సన్యాసదీక్షకు అనుమతిచ్చాను. అయితే నీవు మాత్రం నన్ను ఇప్పుడే వదలిపెట్టి వెల్లకు. నేను దేహత్యాగం చేసిన తరువాత సంస్కారక్రియలు నిర్వహించి, సన్యాసాన్ని స్వీకరించు. అప్పటిదాకా నాతోనే వుండు. అలా వీలుకానప్పుడు నీలాంటి పుత్రుని పొందిన లభించే ఫలమేమిటి ?' అన్నది. అందుకు ఆచార్యులు

'తల్లీ, చింతించకు, నేను ఎక్కడ వున్నా నీవు తలచిన మాత్రానికే పగలుకాని, రాత్రికాని నీ దగ్గరికి చేరగలను. నా మాటపై విశ్వాసం వుంచు. తండ్రి ధనాన్ని అనుభవిస్తున్న దాయాదులు నీ యోగక్షేమాన్ని చూచుకుంటారు. మరి నేనిక్కడ వుండి మాత్రం ప్రయోజనమేమిటి . నీ దగ్గర ఉన్నదానికంటే నూరురెట్లు సత్ఫలాన్ని నీకు లభింపచేస్తాను. నీకు ఇచ్చిన మాట ప్రకారం మరణ కాలంలో నీకు దగ్గరగా వుంటాను. సన్యాసి అయినప్పటికీ నీ దహన సంస్కారం చేస్తాను. ఈ విషయంలో నేను దర్మశాస్త్రాన్ని కూడా లెక్కచెయ్యను. మాతృభక్తి ఆదర్శాలకంటే సన్యాసాశ్రమపు ఆచార నియమాలు గొప్పదికావు. నాకు అనుజ్ఞ ఇవ్వు'అని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్ళిపోయారు.

ఇలా నిర్ణయం తీసుకున్న ఆచార్యులకు మరొక తాత్కాలిక విఘ్నం కలిగింది. 'శ్రేయాంసి బహు విఘ్నాని' అన్నారు కదా!తల్లి క్షేమం కోరి పూర్ణానదిని ఇంటికి దగ్గరగా తెప్పించారు. వర్షాకాలంలో పొంగి ప్రవహించే పూర్ణానది వలన కృష్ణ దేవాలయంలోని విగ్రహం దెబ్బతిన్నది. ఆ దేవత అశరీరవాని ద్వారా ఆచార్యులను చూచి 'అయ్యా! సన్యాసి! నన్ను సురక్షిత స్థలానికి చేర్చు.' అన్నది. అప్పుడు ఆచార్యులు ఆ కృష్ణవిగ్రహాన్ని పైకి తీసి ఎత్తైన సురక్షిత స్థలంలోనికి చేర్చారు. ఆ తరువాత తమ సన్యాస యాత్ర ప్రారంభించారు.

**సద్గురు సందర్శనము :**

ఆచార్యులు సకల శాస్త్ర నిపుణులు, బ్రహ్మ జ్ఞాన నిధులు, జన్మతః జ్ఞాన ధనులు అయిన ప్పటికీ గురు శుశ్రూష, క్రమ సన్యాసము, తత్వోపదేశాలను నేర్చుకొను ముందు తరాల వారికి ఆదర్శమైన సత్సంప్రదాయాలను చూపాలని, ఆ మహత్వాకాంక్ష మేరకు గురువును అన్వేషిస్తూ ముందుకు సాగారు. స్వస్థలం నుండి కాలి నడక ద్వారా సంచరిస్తూ వనాలు, నదులు, కొండలు, అడవులు దాటుతూ పల్లెలు, నగరాలు, పల్లెవాసులు, నగరవాసులు ఇలా విశ్వమంతటా వ్యాపించివున్న పరమాత్ముని అస్తిత్వాన్ని గమనిస్తూ 'ఇందు భవా' అనే నదీతీరానికి వచ్చి అక్కడ ఒక గుహను చూచారు. ఆ గుమద్వారము చిన్నగా వుంది. అక్కడ ఎవరో మహాత్ముడు తపస్సు చేస్తున్నాడని భావించి ప్రదక్షిన నమస్కారము చేశారు. ఆయన ఆలోచన నిజం. శ్రీ గోవింద భగవత్పాదులనే యతి ఆ గుహలో ధ్యానారూఢులై కూర్చుని వున్నాడు. ఆయన అలా ఎంత కాలం నుంచి కూర్చుని వున్నారో తెలియదు. అక్కడున్న కొంతమంది సాధువుల ద్వారా ఆయన పేరు మాత్రం తెలుసుకున్నారు. ఆయన ఆదిశేషుని అవతారమేనని తెలిసి ఆయున్ను స్తుతించాడు. ఆదిశేషుడు తన పతంజలి అవతారంతో సహస్ర ముఖాలతో శాస్త్రోపదేశం ప్రారంభించినట్లుగా వుంటుంది. వ్యాకరణ శాస్త్ర మహాభాష్యాన్ని అనుగ్రహించారు. ఆ మునియే ఇప్పుడు గోవింద భగవత్పాదులుగా ధ్యానారూఢులైన విషయం విని ఆచార్యులు ఆయనను సమీపించారు. అలా ఆ మహనీయులు గౌడపాదాచార్యుల శిష్యులయ్యారు. అలాంటి గోవింద భగవత్పాదాచార్యులు శంకరులకు గురువయ్యారు.

**గురూపదేశము - అనుగ్రహము :**

ఆచార్యుల అపూర్వ స్తోత్రాన్ని విని ధ్యానం నుండి బయటికి వచ్చిన గురువు శ్రీ శంకరులకు

దర్శనమిచ్చారు. 'నీవు ఎవరు ? అని గురువు అడిగిన ప్రశ్నకు

'స్వామిన్నహం న పృధివీ న జలు నతేజో:
న స్పర్శనో న గగనం న చ తద్గుణావా
నాపీంద్రియాణ్యపి తు విద్ధి తతో వణిష్టో
యః కేవలోస్తి పరమః స శివోహమస్మి'

అని ఉత్తరమిచ్చారు. అంటే "స్వామీ! నేను భూమి, జలము, తేజస్సు, వాయు, ఆకాశ హోగూ పంచభూతముల గుణాలేవీ (శబ్ద స్పర్శ రూప రస గంధ) కాదు. అలాగని ఇంద్రియ గుణాలు కూడా కాదు. వీటన్నింటినీ మీరిన తనకు తానే ప్రత్యేకమైన మంగళ రూపమైన శివుడే నేను" అని భావం. దానికి గురువులు సంతోషంతో 'అయ్యా, నీవు కైలాసవాసి అయిన శంకరుడవే. మానుష వేషంలో ఇక్కడికి వచ్చావు. నేను దివ్యదృష్టితో ఈ విషయాన్ని తెలుసుకున్నాను. నీకు స్వాగతం అన్నారు. ఇలా గురుశిష్యుల సంవాదం తరువాత శిష్యుడు గురుపూజ చేశాడు. గురువులు. క్రమబద్ధమైన సన్యాస దీక్షను అనుగ్రహించారు. వేదాంత అర్థవిచారానికి సంపూర్ణ జ్ఞాన నిష్ఠను పొందడానికి మున్ముందు మోక్షాన్ని పొందడానికి సన్యాసం అతి ముఖ్యమైన ద్వారం. అంతేకాదు అది జ్ఞాన భూషణం కూడా. అందుచేత పరమ హంస వారి వ్రాజ్యమును అనుగ్రహించి, బ్రహ్మోపదేశం చేసి "శ్రీశంకర భగత్పాదయతి' అన్న యోగపట్టాన్ని అనుగ్రహించారు. యోగ పట్టమంటే సన్యాసం స్వీకరించిన తరువాత కూడా లోక వ్యవహార నిర్వహణ కోసం గురువులు చేసే నామకరణమే. ఆచార్యులకు పూర్వాశ్రమంలోను, సన్యాసాశ్రమంలోను 'శంకర' అన్న పేరే లభించింది. ఇలా గురు కృపాపాత్రులైన శ్రీ శంకర భగవత్పాదులు యతిశ్రేష్ఠులుగా ప్రకాశించారు. కొంతకాలం గురుసాన్నిధ్యంలోనే వుండి సేవ చేశారు. శిష్యుడు గురువుపట్ల భక్తి భావంతో ఉపదేశము, ఆచరణ అనుష్ఠానముల ద్వారా విద్య నార్జించాలి. గురుభక్తి సంపన్నులైన ఆచార్య శంకరులు గురు సన్నిధిలోని అన్ని ఆచార విచారాలను అనుసరించి తెలుసుకున్నారు.

**ఆచార్యుల యోగ సిద్ధి :**

గురుసేవా పరాయణులైన ఆచార్యులు ఇందుభవా నదీ తీరంలోనే వుండిపోయారు. మునుపొక సారి మహాలక్ష్మి ప్రార్థన ద్వారా బంగారు ఉసిరి కాయల వర్షాన్ని కురిపించారు. అలా మరొకసారి తన 'యోగశక్తి'ని తెలియజేయవలసిన అవసరం ఏర్పడింది. సందర్భానికి తగినట్లుగా వ్యవహరిస్తారే కాని ఆయనకు వాటిలో ఏ మాత్రం ఆసక్తిలేదు. గురు సన్నిధిలో వున్నప్పుడు ఒక సారి వర్షానికి నది పొంగి ప్రవహించసాగింది. గురువు గారు ధ్యానమగ్నులై వున్నారు. గుహ మునిగిపోయే పరిస్థితి వచ్చింది. శంకరులు వెంటనే గుహద్వారం దగ్గర తమ కమండలాన్ని వుంచి ఆ ప్రవాహాన్ని ఆపగలిగారు. అగస్త్యుడు సముద్రాన్ని ఔపోసన పట్టినట్లుగా ఆచార్యులు నదిని కమండలంలో పట్టివుంచారు. ఇది లౌకిక విచారం. ఇంకో రకంగా ఆలోచించగగలిగితే మనకు పొంగిపొర్లే నదీ ప్రవాహం జ్ఞానగంగగాను, ఆ కమండలం ఆచార్యుల హృదయంగాను గోచరిస్తుంది. గురువు ప్రసాదించిన అఖండ జ్ఞాని గంగను హృదయం గమం చేసుకున్న మహా సాధకులు ఆచార్యులు. కాసేపటి తరువాత ధ్యానం నుండి బయటపడ్డ గోవింద భగవత్పాదులు శిష్యునిలోని యోగసిద్ధికి చాలా సంతోషించారు.

(సశేషం)

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## అన్నదమ్ముల అనుబంధం

మరునాడు ప్రాతఃకాలం శ్రీ వసిష్ఠులు తమ ప్రవచనాన్ని కొనసాగినస్తా యిలా చెప్పారు. 'రామచంద్రా! జీవితం చాలా విచిత్రంగా ఉంటుందయ్యా! ఒక చెట్టుకాయలు తీపిగానో, పులుపుగానో ఉంటవి. కాని ఒక తల్లి బిడ్డలు ఒకే సంస్కారంతో పుట్టాలని నియమంలేదు. ఆ విషయంలో మీ నలుగురన్నదమ్ములు ఆదర్శప్రాయులు, తుల్యసద్గుణ సమన్వితులు. ఇద్దరు పుత్రులు ఉత్తమవంశ సంజాతులు, జీవనపథంలో భిన్న ప్రస్థానాలు చేసిన ఒక పవిత్రమైన ఇతిహాసాన్ని చెబుతాను విను. కథ చిన్నదైనా కథార్థం గొప్పది.

జంబూద్వీపంలో మహేంద్రపర్వతం మీద దీర్ఘతపుడు అను మహర్షి ఆశ్రమం నిర్మించుకొని జీవిస్తున్నాడు. పేరుకు తగ్గట్టుగా నిరంతర తపస్సు ఆయన జీవన విధానం. ఆయనకు ఇద్దరు పుత్రులు. పెద్దవాడు పుణ్యుడు, రెండవ వాడు పావనుడు. తండ్రి ఇద్దరికీ సమానంగా శాస్త్ర పాండిత్యమూ, సాధన, జ్ఞానము మొదలైనవన్నీ యిచ్చాడు. ఆ పిల్లల భవిష్యత్తు తనలాగే జ్ఞానమార్గంలో ఫలవంతం కావాలని ఆశించాడు. పెద్దవాడైన పుణ్యుడు తండ్రి మార్గాన్ని ఆయన ఉపదేశంచిన జీవిత విధానాన్ని తు.చ. తప్పక అనుసరించాడు. మహాజ్ఞానిగా పరిణతి చెందుతున్నాడు. రెండవవాడైన పావనుని జీవన మార్గమే మరో పద్ధతి నవలంభించింది. ఒకరోజు తండ్రిగారి దగ్గరకు వచ్చి సగౌరవ ప్రణామాదులు జరిపి తనకి మున్యాశ్రమ జీవితం పట్ల విసుగు పుట్టిందనీ విశాల విశ్వంలోకి వెళ్ళి లోకవృత్తంలో ప్రవర్తించి ఆ జీవితాన్ని చవిచూడాలని ఉన్నదనీ చెప్పి అనుమతించవలసినదిగా ప్రార్థించాడు. దీర్ఘతపుడు 'నీ యిష్టం. శుభం భూయాత్' అని ఆశీర్వదించాడు. పావనుడు పర్వతారణ్య సీమలను పరిత్యజించి, మునివృత్తికి స్వస్తి చెప్పి వెళ్ళిపోయాడు. దీర్ఘతపుడు పెద్దకొడుకైన పుణ్యునితో అన్నాడు. 'వాడు' తిరిగి వస్తే వాడి భాగం వాడికిచ్చెయ్యి అని. 'అలాగే' అన్నాడు పుణ్యుడు.

కాలచక్రం తిరుగుతున్నది. నగర జీవనం ప్రారంభించిన పావనుడు తొలుత అక్కడ వాతావరణానికి అలవాటు పడలేక పోయినా క్రమంగా అలవాటు పడ్డాడు. వ్యాపారం చేశాడు. మొదట లాభము, పిదప నష్టము. పొలాలను గుత్తకు తీసుకుని వ్యవసాయం చేశాడు అతివృష్టి అనావృష్టుల వల్ల దెబ్బతిన్నాడు. పౌరోహిత్యం చేబట్టాడు. వైదిక ధర్మం విస్మరించడం వల్ల అందులోనూ రాణించలేదు. ఇక రజని చరితము గ్రామణిత్వము, నియోగము, మాతాపత్యము, సాక్షివాదము మొదలైన మార్గాలు అవలంభించడానికి మనసా సంసిద్ధుడవుతున్న రోజుల్లో ఒకనాటి నిద్రలో నాల్గవ యామంలో నాన్నగారు కనుపించి చేత నిన్ముద్రతో "రారా బాబూ రా" అని పిలిచినట్లు అనిపించింది. మేలుకొని ఉన్నవాడు ఉన్నట్లు ఉరుకు పరుగులతో మహేంద్రపర్వతాన్ని చేరుకున్నాడు.

పావనునికి దారుణ దృశ్యం గోచరించి వయస్సుచే చివికిపోయి ముసలివగ్గు అయిన తండ్రి దీర్ఘతపులు కాలధర్మం చెందారు. ఆయన మృతదేహంపై బడి

పావనుడు విపరీతంగా రోదనం చేస్తున్నాడు. గుండెలు బాధుకుంటున్నాడు. కన్నీరు మున్నీరవుతున్నాడు. పుణ్యుడు అతన్ని ఓదార్చి 'తమ్ముడూ ముందు జరుగవలసిన కర్మకలాపం ముఖ్యం కదా' అని చెప్పిన మీదట సోదరులిద్దరూ కర్మకాండ నిర్వహించారు.

"పావనా ఎందుకయ్యా దుఃఖిస్తావు. ఆయన శరీరం రాలిపోయింది. ఆత్మ అవినాశి. లోక జీవితం కేవలం ఒక స్వప్నం విను. నీవు మొదట ఖనిజ ప్రపంచం నుండి మేల్కొన్నపుడు వింధ్య పర్వతంమీద రావిచెట్టుగా పుట్టావు. తరువాత మర్రిచెట్టును తొలిచే ఘుణటకము (మానును తొలుచు పురుగు)గా, పిమ్మట కోడిగా - జన్మలెత్తి ఇప్పుడు పర్వతగుహమీద బ్రాహ్మణుడవై జన్మించావు. ఏ జన్మలో ఎవరు ఎవరికి తండ్రులో తల్లులో, పిల్లలో, పాపలో... అంత ఒక అద్దంలో బింబంలాంటి కథ కనుక 'తమ్ముడూ నీవిక మోక్షం పొందు'. ఇలా బోధించిన అన్నగారి మాటలు విని పావనుడు నిజంగా పావనుడై బ్రహ్మమార్గాన్ని అవలంబించాడు. పుణ్యుడు నాన్నగారిని మనస్సులో తలచుకొని నాన్నగారూ తమ్ముడి భాగం ఇచ్చేశాను' అన్నాడు.

కనుక రామచంద్రా
ప్రశమిత సకలైషణో మహత్మ
న్భవ భవబంధమపాస్య ముక్త చిత్తః
మనసి విగతరజ్జవః కదాశాః
పరిగలితాసుచ తాసుకోనముక్తః

(అన్ని కోర్కెలు నశింపజేసి ఆశ అనే సంసార బంధాన్ని ఛేదించి జీవన్ముక్తుడవు కావలి. సంకెళ్లలాగ, త్రాళ్లలాగా బంధహేతువులైన ఆశలను ఎవరు నశింపజేస్తారో వారే కదా ముక్తులు) అంటూ ముగించారు. □

---

□ 9 వ పేజి తరువాయి ......

'అనగా, 'గుణకర్మల విభాగము ననుసరించి నాలుగు వర్ణములు నా చేతనే సృష్టింపబడినవి'.

అంటే జాతిని బట్టి కర్మలను కాకుండా వారాచరించు కర్మలను బట్టి జాతిని నిర్ణయించినాడు.

ఈ విభజన శ్రీకృష్ణ భగవానునిచే ఎలా చేయబడినదో ఇపుడు మనము తెలిసికొందము.

**శ్లో॥ శమో దమ స్తప శ్శౌచం క్షాంతి రార్జవమేవ చ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్॥ (భ.గీ. 18-42)**

'శమము (అంతరింద్రియ నిగ్రహము), దమము (బహిరింద్రియ నిగ్రహము), తపస్సు (శాస్త్రీయ కాయిక క్లేశము), శౌచము (బాహ్యాభ్యంతర పరిశుభ్రత), సహిష్ణుత, సరళత, జ్ఞానము (శాస్త్రజ్ఞానము), విజ్ఞానము (తత్త్వానుభూతి), ఆస్తిక్యము (శాస్త్రార్థము నందు దృఢమగు నమ్మకము) మున్నగు కర్మలు స్వభావముగ కలవారు బ్రాహ్మణులు.

**శ్లో॥ శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధేచాప్య పలాయనమ్।**
**దానమీశ్వర భావ శ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥ (భ.గీ. 18-43)**

'శౌర్యము, తేజస్సు, ధైర్యము, కార్యకుశలత్వము, యుద్ధమునంద పారిపోకుండుట, దానము, లోకనియంతృత్వము మున్నగు కర్మలు స్వభావముగా గలవాడు క్షత్రియుడు'.

**శ్లో॥ కృషి గోరక్ష్య వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ (భ.గీ. 18-44)**

'వ్యవసాయము, గోరక్షణము, వాణిజ్యము మున్నగు కర్మలు స్వభావముగా గల వారు వైశ్యులు. ఇతరులకు పరిచర్య చేసి జీవించాలనే స్వభావము గలవారు శూద్రులు'.

కృష్ణభగవానునిచే ప్రతిపాదించబడిన గుణకర్మల ననుసరించిన వర్ణవిభజనను సమర్థిస్తూ అనేక నిదర్శనములు కన్పట్టుచున్నవి.

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

శ్లో॥ రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహుబాహూరుపాదమ్।
బహూదరం బహుదంష్ట్రాకరాళం దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్॥
(11-23)

ఓ మహావిష్ణూ! ఆకాశాన్ని తాకే విధంగా, అనేకమైన రంగులతో ప్రకాశిస్తూ అనేక ముఖాలతో, విశాల నేత్రాలతో ఉన్న నిన్ను జూచి నా హృదయ అంతర్భాగము శాంతిని, స్థిరత్వాన్ని కోల్పోతున్నది (నేను జడుసుకుంటున్నాను) మనకు ఎప్పుడూ కనబడని విషయం కనబడితే చాలా వ్యాకాలచిత్తులం అవుతాము.

శ్లో॥ నభఃస్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా ధృతిం న విందామి శమం చ విష్ణో॥
(11-24)

ఇది కూడా నిజానికి చాలా దగ్గరగా సహజంగా ఉన్నది .రౌద్రాకారంతో ఉన్న కాళికాదేవిని చూచినప్పుడు, 70 అడుగులు / 80 అడుగులు వీరాంజనేయ మూర్తిని చూచినప్పుడు ఒక్కసారిగా హృదయం"కలుక్కు" మంటుంది. అర్జునుడికి అదే వందరెట్లు / వెయ్యి రెట్లు అధికంగా జరిగింది. అమ్మానాన్నలు మొహమంతా కందగడ్డలాగా చేసి, జీవురించిన ముఖంతో గుడ్లెర్ర జేసి చూస్తే పిల్లలు భయపడినట్లే అర్జునుడు కూడా భయకంపితుడైనాడు. అందుకే మానసిక సమతుల్యాన్ని కోల్పోయాడు. ఒకసారి మహాప్రభో అంటున్నాడు, ఒకసారి ఓ విష్ణూ అంటూ సంబోధిస్తున్నాడు అంటే Mental Balance కోల్పోయాడు. అందుకే అంతటి వీరార్జునుడు, శివుడితో పోరాడి పాశు పతాస్త్రాన్ని సంపాదించిన కిరీటి బేలగా మాట్లాడుతున్నాడు. ప్రళయ కాలమందలి అగ్నితో సమానమైన నీ ముఖాలను, నీ దంతాలను జూచి అసలు దిక్కులే నాకు తెలియడంలేదు. నాకు శాంతిని కలిగించు. నాకు దేవతలకు కూడా శాంతిని కలిగించు. తాను భయభ్రాంతుడై అందరూ (తాను ఆ కాలరూపంలో చూచిన అందరూ) భయభ్రాంతులైనారని అనుకుంటూ అందరికీ శాంతి కలిగించమంటున్నాడు.

శ్లో॥ దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని।
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥ .....11-25

ఆ కాల పురుషుడి పళ్ళమధ్య వంద మంది కౌరవులు, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మాత్రమే కాక పాండవుల పక్షాన పోరాడుతున్న అనేక మంది వీరులు కూడా పడిపోతున్నారు. వీళ్ల తలలు నలిగిపోతున్నాయి. ఆ కాలపురుషుడీ నోట్లోకి వేగంగా వెళ్లిపోతున్నారు. కాలపురుషుడు అందరినీ కబళిస్తున్నాడు. అందరూ అతని నోళ్లల్లోకి పోతున్నారు.

శ్లో॥ అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావనిపాలసం ఘైః।
భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥.11-26

శ్లో॥ వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాలాని భయానకాని।
కేచిద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః ॥.11-27

నదీ ప్రవాహలన్నీ సముద్రంలోకి ప్రవహిస్తున్నట్లు ఈ మహావీరులందరూ నీ ముఖాగ్నిలోకి ప్రవేశిస్తున్నారు.

శ్లో॥ యథా నదీనాం బహవోఽంబువేగాః సముద్రమేవాభిముఖా ద్రవంతి।
తథా తవామీ నరలోకవీరా విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి ॥ .....11-28

మిడతలు మండుతున్న అగ్నిలో ప్రవేశించుచున్నట్లు ప్రజలందరూ నీ ముఖద్వారాల్లోని అగ్నిలో ప్రవేశిస్తున్నారు.

శ్లో॥ యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశంతి లోకాః తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ ...11-29

ఓ విష్ణుదేవా! అగ్ని జ్వాలల ముఖాలతో నీవు అన్ని దిక్కుల నుండి ప్రజలందరిని మ్రింగి వేయుచున్నట్లు దర్శనమిస్తున్నావు. నీతేజో కిరణాలు భయంకరంగా తయారైనాయి.

శ్లో॥ లేలిహ్యసే గ్రసమానః సమంతాత్ లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః।
తేజోభిరాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥ ..11-30

ఇంత భయంకరంగా ఉన్న నీవు ఎవరివో నాకు దయచేసి తెలుపవలసినదిగా కోరుచున్నాను. నీవు ముందు ప్రసన్నుడివి కావలసింది. నీవే ఆది పురుషుడివని అనుకుంటున్నాను. నీ ప్రవృత్తి నాకు తెలియజేయవలసినదిగా కోరుకుంటున్నాను.

ఒక్కొక్కసారి మనం కొందరిని ప్రేరేపించకూడదు ఆ తరువాత వాళ్ళను మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం, శాంతింపజేయడం చాలా కష్టమైన పని అవుతుంది. డా॥ నటరాజ రామకృష్ణగారు నీకు గురువుగారు. ఏదో సందర్భంలో మాటల్లో "ఈ రకమైన నర్తనం మీరు ఈ వేళ నాకు చేసి చూపగలరా" అంటూ అడిగాను. "వద్దండీ! ఆవేశం వస్తే ఆగలేను. నన్ను నేను నియంత్రించుకోలేను'' అన్నారు మాష్టారు రామకృష్ణగారు. అప్పటికి ఆయన వయస్సు 77 సంవత్సరాలు. "ఒక్కసారి మాష్టారూ ప్లీజ్" అన్నాను. ఆయన నా కోసం లేని ఓపిక తెచ్చుకొని మరీ ప్రపంచం అంతా ఊగిపోయే విధంగా అడుగులు వేయడం ప్రారంభించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నందున నాకు భయం వేసింది. "ఇంక చాలు లెండి మాష్టారూ. ఇక దయచేసి ఆపండి" అని నేను బ్రతిమిలాడుకున్నా ఆయన ఆపలేదు. క్లైమాక్సుకు వెళ్లి మహోన్నతంగా 77 సంవత్సరాల వయస్సులో ఊగిపోతూ శిష్యులను ఊపివేస్తున్న డాక్టర్ నటరాజ రామకృష్ణ గారిని ఆపడం ఎవరి తరమూ కాలేదు. మళ్లీ తాళం క్రమేపి తగ్గించి, తగ్గించి ఆయనను ప్రశాంతపరచడానికి పెద్ద శ్రమే చేయవలసి వచ్చింది.

ఏదో తమాషాగా "మా బావలో ఇంత పవరు ఉందా'' అనుకుంటూ అడిగిన అర్జునుడు ఆ కర్మ యోగిలో దాగివున్న "కర్మ"ని (పనిని) కాలపురుషుడిలో దాగివున్న కాలాన్ని సమస్త ప్రపంచాన్నీ సందర్శించి చాలా భయపడిపోయాడు. శాంతించమని వేడుకున్నాడు. ఇది చాలా సర్వసాధారణమైన స్వాభావికమైన విషయం. కలెక్టరు మనకు తెలిసిన వాడే కదా అని పిచ్చి పిచ్చిగా చేస్తే ఆయనకు కోపం వస్తే ఆ కోపం భరించలేం. ఎంతో శ్రమ చేసిన తర్వాత గానీ అతడు మరలా శాంత చిత్తుడు కాలేడు.

తిక్కన గారి భారతాన్ని చదివినప్పుడు, పోతన భాగవతాన్ని విన్నప్పుడు ఆయా పాత్రలు మన కళ్ల ముందు కనబడడం సర్వసాధారణమే. కళ్లకు కట్టినట్లు చిత్రీకరించిన సన్నివేశాలు చదువుతున్నప్పుడు ఆయాపాత్రలు మన ముందు కదలాడటంలో ఆశ్చర్యంలేదు.

"సింగం బాకటితో గుహాంతరమునన్" అన్న పద్యం విన్నప్పుడు, 'దుర్వారోద్యమ బాహు విక్రమ'',

తరువాయి 31 వ పేజీలో.......

# జగచ్చిత్రం

.... శ్రీ కపిలవాయి లింగమూర్తి

వేదాంతం జగత్తును మాయ అంటే బ్రహ్మజ్ఞానులు దీన్ని జగచ్చిత్రం అంటారు. చిత్రం అనే పేరు నేడు సినిమాకు గూడ వర్తిస్తుంది. కనుక దాన్ని కనిపెట్టిన తామ్నైరీబ్రదర్స్ ఏ ముహూర్తంలో కనిపెట్టినారోగాని అది సరిగా మన యొక్క ఈ సృష్టికి ప్రతిబింబంగా ఉంది.

సినిమా చీకటిలో ప్రదర్శించబడుతుంది. ఈ సృష్టి గూడ పరబ్రహ్మంలో ఏకాంశమైన ప్రకృతి అనే చీకటిలోనే ఏర్పడింది. ప్రొజెక్టరులో బొమ్మ తలక్రిందుగా నడుస్తుంది. మన సృష్టి గూడ దివి నుండి ఊర్థమూలం అథశ్శాఖలుగానే నడుస్తుంది. ఫిలింలో ఉన్న బియ్యం గింజంత బొమ్మ తెరపై మనంత ఇంకా మన కంటె పెద్దగా కూడ అయి నటిస్తుంది. తల్లిగర్భంలో ప్రవేశించి నపుడు జీవుడు గూడ అంతే. బియ్యపు గింజంత గాదు దాని సన్నని ముక్కంత ఉండి భూమి పైకి వచ్చిన పిమ్మట ఏడుజేనల వరకు పెరిగి సంసారం చేస్తున్నాడు.

సినిమా తెర నిశ్చలం. నిర్వికారం, మరియు నిర్మలం, నిష్కళంకం. అదట్లా ఉన్నపుడే ప్రొజెక్టర్ దానిపై ప్రసారం చేసే చిత్రాన్ని మనం చూచి ఆనందించ గలుగుతున్నాం గాని అది అట్లాకాక మాటిమాటికి కదలుతున్నా, అట్లాకాక అదొక ఘనరూపమైన ముద్దగా వున్నా మరేదైనా రంగులలో ఉన్నా దానిపై ఆ చిత్రప్రదర్శనకే వీలుండదు గదా! ఈ సృష్టికాధారమైన పరబ్రహ్మతత్వం గూడ అంతే. అది నిశ్చలం. నిర్వికారం. అదొక ఘనపదార్థంకాని, ద్రవపదార్థం కాని గాదు. అది అట్లా వున్నది కాబట్టే దానిలో ఈ సృష్టి అంతా ఏర్పడి నడుస్తుంది. అది ఒక వేళ ఈ భూగోళం వలె ఒక ఘనాకారమై ఉంటే ఎవరు చెప్పి చూపకుండానే అది మన కంటికి కనిపిస్తుండేది.

సినిమా షూటింగు వేళలో దర్శకుడు కూడా ప్రక్కనే ఉండి నటులకు సూచన లిస్తుంటాడు కాని అతడు కెమెరాలోనికి వచ్చి మాత్రం మనకు కనిపించడు. ఈ జగత్కర్త గూడ అంతే జీవుల వెంటనే వుండి వారిని నడిపిస్తుంటాడు కాని వారి కంటికి మాత్రం కనిపించడు.

ఈ విశ్వమనే థియేటర్‌లో పరబ్రహ్మ మనే తెరపై త్రిమూర్తులనే ఆపరేటర్లు మాయ అనే ప్రొజెక్టర్‌లో ఈ సంసారమనే చిత్రాన్ని నడుపుతున్నారు. ఈ చిత్రంలోని పాత్రలు చిరుతల రామాయణంలో వలె తమ పాత్ర నటులై నటిస్తూ రెండవవైపు ప్రేక్షకులై తక్కినవారిని చూస్తున్నారు.

సినిమా చూస్తున్నంత సేపు మనం చిత్రం బాగుందని దానిలో లీనమై పోతున్నాంగాని ఆ చిత్రం నడిచేందుకు దాని వెనుక తెర ఒకటి వుంది అనే స్పృహయే మనకుండదు. అలాగే వ్యక్తి ఈ సంసారంలో సుఖమో దుఃఖమో ఏదో ఒకటి అనుభవిస్తున్నాడు గాని ఇట్లా నడవటానికి కారణం దీని వెనుక దైవమనే వాడొకడున్నాడని మాత్రం ఎపుడూ అనుకోడు. కనుక ఈ జగచ్చిత్రాన్ని నడిపేవానిని అది నడిపే చేతులను తెలిసికున్నపుడే ఈ మానవజన్మ సార్థకమౌతుంది. ●

# శ్రీరామ భక్తి



## 2. నారదుని శ్రీరామభక్తి

- కీ.శే. డాక్టర్ రోహిణి వెంకట సుందరవరద రాజేశ్వరి

**అహో దేవర్షి ధన్యో...యం యత్కీర్తింశార్ జ్ఞధన్వనః।**
**గాయన్మాద్యన్నిదం తన్త్ర్యారమ యత్యాతురం జగత్॥**
(శ్రీమద్ భాగవతము)

అహో! దేవర్సి నారదుడు ధన్యుడు. వీణా నాదముతో హరి గుణములను గానము చేయుచు ఆనంద నిమగ్నుడై అందరికి ఆనందము గలిగించుచుండును. భగవానుని వోలె ప్రకటమగుచు. భగవద్భక్తిని మాహాత్మ్యమును విస్తరింపజేయుచు, లోక కల్యాణ నిమిత్తము జగత్తునందు సంచరించుచుండును. భగవంతుని సహచరుడుగా త్రిలోకము లందు ప్రసిద్ధుడు. వీణావాదనతో భగవానుని గానము చేయుచు సదా పర్యటించుచుండును. ఇతడు సంకీర్తన పరమాచార్యుడు. భాగవత ధర్మప్రధాన ద్వారశాచార్యులలో నొకడు. భక్తి సూత్ర నిర్మాత. ఇతడు రచించిన భక్తి సూాత్రములందు భక్తి తత్త్వము సుందరమైన వ్యాఖ్యతో నడచెను. ఇతడు సమస్త పృథ్వి యందును భక్తిని స్థాపించుటకు ప్రతిజ్ఞ చేసెను. నారదుడు స్వవిషయమిట్లు చెప్పెను.

ప్రగాయతః స్వవీర్యాణి తీర్థపాదః ప్రియశ్రవాః।
ఆహూాత ఇవమే శీఘ్రం దర్శనం యాతి చేత సి॥
(శ్రీమద్భాగవతము)

"నేను పరమ పావన చరణుని గుణగాన సంకీర్తన చేసినప్పుడు పిలచినట్లుగా వెనువెంటనే భగవానుడు ప్రత్యక్షమగును. నారదుడు బ్రహ్మమానస పుత్రుడు. భగవానుని ఆత్మరూపుడు. దయామయుడైన భక్తవత్సలుడు చేయదలచిన దానిని నారదునిచే చేయించును".

వాల్మీకి, వ్యాస, శుకదేవ, ప్రహ్లాద, ధృవ, అంబరీసాదులకు నారదుడే భక్తి నుపదేశించెనని పురాణముల యందు స్పష్టముగ నున్నది. శ్రీమద్భాగవతము, శ్రీవాల్మీకి రామాయణము రెండునూ అపూర్వమైనవి. ఇవి ఈయన దయతోనే లోకమునకు ప్రాప్తించినవి.

వ్యాస భగవానుడు సమస్త వేద విభజన, ఇతిహాసపురాణ, మహాభారతాది రచనలు చేసి కృతార్థుడు కానట్లు ఖిన్నుడైయున్న సమయమున నారదుడు అచటికి వెళ్ళి "బ్రహ్మన్! మీరు సాక్షాత్ నారాయణు అవతారులు. వేదవిభజనము, పురాణ భారతాది గ్రంథరచన చేసిన మీరు ఎందుచేత ఖిన్నులై కనపడుచున్నారు ?" అని అడుగగా వ్యాసుడ "దేవర్షీ! నిజముగ నేను అట్లేయుంటిని. ఎందుచేతనో బోధపడుటలేదు.మీరు త్రికాలజ్ఞులు. వాయుదేవుని వలె సర్వవ్యాప్తులు. దయచేసి నా దుఃఖము పోవు ఉపాయము చెప్పు"డనగా నారదుడు "మహర్షీ! మీరుభక్తి సాహిత్యమును రచింపలేదు. భగవానుని నిర్మల యశస్సును గానము చేయలేదు. మీరు వర్ణ ధర్మము, ఆశ్రమ ధర్మము, స్త్రీ ధర్మము, రాజధర్మము, అపద్ధర్మము, మోక్షధర్మము మొదలగు వివిధ ధర్మములను వర్ణించితిరి. కాని పరమ హంస పరమ భాగవత ధర్మమును వర్ణించలేదు. అందువలన మీకు మనశ్శాంతిలేదు. భగవద్భక్తి రసముతో నిండియున్న భాగవత గ్రంథమును నిర్మించాడు. భగవద్భక్తి రసముతో నిండియున్న భాగవత గ్రంథమును నిర్మించుడు. భగవానునకు భక్తియేం పరమప్రియమైనది. దీనితో మీరు పూర్ణకృతార్థులగుదురు. పరమానంద భరితులై శాంతి

నొందెదరు" అనెను.

నారదుని ఉపదేశానుసారము వేదవ్యాసుడు కల్యాణ కారకమగు భాగవత గ్రంథమును రచించి దానిని శుకదేవునిచే చదివించెను. ఈ విధముగ భాగవత భక్తి గ్రంథము నారదుని కృపా ప్రసాదము. వాల్మీకి రామాయణము కూడ నారదుని కృపాప్రసాదమే. దీనియందు ప్రథమ శ్లోకము.

తపః స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్।

విశ్వప్రసిద్ధ శ్రీసత్యనారాయణ కథ కూడ నారాయణుని భక్తితో పరిపూర్ణమై ఇంటింటను ప్రచలితమైయున్నది. ధృవునకు నారదుడేమంత్రమిచ్చెను. ప్రహ్లాదుని తల్లి కయాధునకు బోధించగా గర్భస్థ బాలక సహితముగ తల్లీబిడ్డలిరువురు భగవానుని పరమ భక్తులయిరి. తరువాత వచ్చిన విరోచన బల్యాది మహాభాగవతులు ఈ వంశమువారే.

నారదుని నామముతో నారద మహాపురాణము, నారద పురాణము కూడనున్నవి. రెండింటి యందును భక్తి రసామృత కథలే నిండియున్నవి. నారదుని కృపాపాత్రులకు లెక్కలేదు. ఇతడు కృపామూర్తి. ఎవరికెట్టి భక్తి మార్గమును ఉపదేశించవలెనో వారికా విధముగనే ఉపదేశించివారు భగవానుని చరణముల చెంతకేగునట్లు చేయును. ఎలాగైనను జీవులకు వేగముగ భగవత్ ప్రాప్తి గలిగించవలెనని ఇతని ఉద్దేశ్యము. ఇతడు ప్రపంచోపకారి. నారదుడు శ్రీరామ, శ్రీకృష్ణులకు లీలాసహచరుడు.

సమస్త రామాయణ, రామచరిత్ర, రామోపాసన గ్రంథముల యందును, సమస్త స్తోత్రాదుల యందును దేవర్షినారదుడు వక్త, శ్రోత, ఉపాసకుడు. శ్రీరాముని వెంట అతని భక్తుల వెంట కనిపించును. శ్రీరామచరిత మానస మందు ఇతడు శ్రీరాముని ప్రతి లీలలయందును ప్రత్యక్షా ప్రత్యక్ష రూపముతో వానివెంటనుండును. భగవానుని ఆవిర్భావము, వనవాస, పంపా సరోవర, సీతావియోగ సమయములందు శ్రీరామునితో సంభాషించెను. రామ రావణ యుద్ధ సమయమందుకూడ శ్రీరాముని చెంత నుండి ఉత్సాహితుని చేసెను. అయోధ్యయందు శ్రీరాముని రాజ్యాభిషేకానంతరము ఇతడు ప్రతి దినము వచ్చి తన ఆరాధ్యనగరి అయోధ్యశోభను గాంచుచు, శ్రీరాముని దిన చర్యలను చూచుచూ గానము చేయుచుచు, స్తుతించుచు తిరిగి బ్రహ్మలోకమునకు వెళ్ళి సనకాది ఋషులకు సమస్త కథలను వినుపించుచుండును. (రామచరిత మానసము)

శ్రీరాముడు భగవతి సీతతో కలసిరత్న సింహసనాసీనుడై యుండగా, నారదుడు వారిని దర్శించుటకు ఆకాశమార్గము నుండి దిగెను. నారదుని చూచి శ్రీరాముడు లేచి నిలబడి సీతాసహితుడై భక్తి పూర్వకముగ పృథ్విపై శిరస్సు నుంచి ప్రణామము చేసి "మునిశ్రేష్ఠా! మీ దర్శనము అతి దుర్లభమైనది. పూర్వజన్మ పుణ్యము వలన మిమ్ము దర్శించితిని. పుణ్యోదయమగు నప్పుడు సత్సంగ ప్రాప్తిగలుగును. మీ దర్శనముతో కృతార్థుడనైతిని" అనెను.

శ్రీరామునితో నారదుడు "ప్రభూ! సాధారణ మానవుని వలె మాటాడుచునన్నెందుకు మోహమందు పడవేయుచుంటిరి ? మీరు సాధారణ మానవులుకారు. ఆదిశక్తి స్వరూపిణి భగవతి సీత మహామాయా స్వరూపిణి. ప్రభూ! మీరు మాయతో బ్రహ్మాది సమస్త ప్రజలను ఉత్పన్నులను చేయుదురు. ఆ త్రిగుణాత్మిక మాయసదా మిమ్ము ఆశ్రయించియే యుండును. మీరు విష్ణుభగవానులు, జానకి లక్ష్మీదేవి. మీరు శివులు, జానకి పార్వతి. మీరు బ్రహ్మ, జానకి సరస్వతి. మీరు సూర్యదేవులు, జానకి ప్రభ. నిస్సందేహముగ స్త్రీ వాచకములన్నియు శ్రీజానకీ దేవియే. మరి పురుష వాచకములన్నీ మీరే

అయియున్నారు. దేవా! త్రిలోకములలో మీ ఇద్దరు తప్ప ఇంకెవరునులేదు. ఈ సమస్త జగత్తు మీ వలననే ఉత్పన్న మైనది. మీలోనే స్థితమై యున్నది. మీలోనే లీనమగుచున్నది. ఇందు వలన మీరే సర్వకారణాలు. మీచరణములపై భక్తియున్న వారికి క్రమముగ జ్ఞాన ప్రాప్తిగలుగును. మీపై భక్తిగల వారలే వాస్తవముగ ముక్కికి పాత్రులు" అనెను.

**త్వం విష్ణుర్జానకీ లక్ష్మీః శివస్త్వం జానకీ శివా।**
**బ్రహ్మేత్వం జానకీ వాణీ సూర్యస్త్వం జానకీ ప్రభా॥**
**లోకే స్త్రీ వాచకం యావత్ తత్సర్వ జానకీ శుభా।**
**పున్నామ వాచకం యావత్ తత్సర్వంత్వం హి రాఘవ॥**
**తస్మాల్లోక త్రయే దేవయు వాఖ్యాం నాస్తికించన।**
**త్వత్తఏవ జగజ్ఞాతం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్॥**
**త్వయ్యేవ లీయతే కృత్స్నం తస్మాత్త్వం సర్వకారణమ్।**
**త్వత్పాద భక్తి యుక్తానాం విజ్ఞానం భవతి క్రమాత్।**
**తస్మాత్ త్వద్భక్తి యుక్తామే ముక్తి భాజస్త ఏవహి।**
(అధ్యాత్మ రామాయణము)

భగవానుడు భక్తుల, దానుల దీనతను స్వీకరించువాడు గనుకనే నారదుడు శ్రీరాముని ఎదుట తన దీనతను ప్రకటించి భక్తులకు ఆదర్శమయ్యెను. నారదుని భక్తి విలక్షణమైనది. ఆ రహస్యము రామునకు తెలియును. నారదుడు రాముని ఇట్లను గ్రహించుమని ప్రార్థించెను.

'ప్రభూ! నేను మీ భక్తుల భక్తుడను. వారికి కూడ దాసుడను. అందువలన నన్ను మోహితుని చేయక నాపై దయచూపుడు. ప్రభూ! మీ నాభి కమలము నుండి ఉత్పన్నుడయిన బ్రహ్మ నా తండ్రి. అందువలన నేను మీకు పౌత్రుడను. రాఘవా! ఈ భక్తుని రక్షింపుము".

**అహం త్వద్భక్త భక్తానాం తద్భక్తానాంచ కింకరః।**
**అతో మామను గృహ్ణీష్వ మోహయ స్వనమః ప్రభో॥**
**త్వన్నాభికమలో త్పన్నో బ్రహ్మమే జనకః ప్రభొ।**
**అతస్తవాహం పౌత్రో...స్మి భక్తం మాంపాహి రాఘవ॥**
(అధ్యాత్మ రామాయణము)

భక్తితో దేవర్షి నారదుని భక్తవత్సల శ్రీరామ భగవానుని సంవాదమును నిత్యము భక్తితో చదువువారు, వినువారు, స్మరించుకొనువారు దేవతలకు కూడ లభించని మోక్షపదమును పొందెదరు.

**సంవాదం పఠతి శృణోతి సంస్మరేద్వా**
**యోనిత్యం ముని వర రామయోః స భక్త్యా।**
**సంప్రాప్నో త్యమరసు దుర్లభం విమోక్షం**
**కైవల్యం విరతి పురః సరం క్రమేణ॥**
(అధ్యాత్మ రామాయణము)

ఇట్టి అనన్య భక్తునకు భక్తవత్సల భగవానుడు శ్రీరామునకు పదే పదే ప్రణామములు. □

- పరోపకారం ఇంటి మీద కప్పు లాంటిది. అది ఎప్పుడూ నిన్ను కాపాడుతూనే వుంటుంది.
- వైరాగ్యమనే నావను ఎక్కినవాడు సంసారమనే ప్రవాహం నుండి సురక్షితంగా ఒడ్డుకు చేరగలడు.
- వేయించిన విత్తనం మళ్లీ మొలకెత్తనట్లు ఆత్మజ్ఞానం కలిగిన వారికి జన్మాంకుర ముండదు.
- వెలుగువైపు నడిచే కొద్దీ నీ నీడ నీ వెనుకకు చేరుతుంది. అదే చీకటి వైపు సాగుతుంటే అది నీ ముందే వుంటుంది. అలాగే నీ ప్రయాణం పరమాత్మ వైపు సాగుతుంటే మాయ నీ వెనుకకు తప్పకుంటుంది. అలాకాక ప్రపంచం వైపు సాగుతున్నావంటే 'నేనున్నా' నంటూ అది నీ ముందుకే వచ్చి నిలబడుతుంది.




### దిగ్విజయ యాత్ర

శరదృతువు రాగానే నదుల్లో లోతు తగ్గిపోయింది. దారిలో బురద ఎండిపోయింది.అంచేత రఘుమహారాజు దిగ్విజయ యాత్రకు సిద్దమయ్యాడు. అతడు గుఱ్ఱాల శాంతికై హోమం చేయించాడు. అప్పుడు అగ్నిదేవుడు తన చేతిమీదుగా అతనికి విజయం అందిస్తున్నాడా అన్నట్లుగా ప్రదక్షిణజ్వాలతో వెలిగాడు. యాత్రారంభంలో రఘువు పూజాదికాలు నిర్వర్తించాడు. రాజధానికీ, కోటకూ గట్టి కాపలా వుంచాడు. ఆరు రకాల దండుతో జైత్రయాత్రకు బయలుదేరాడు. అప్పుడు నగరంలోని పెద్ద ముత్తైదువలు శుభసూచకంగా అతనిపై లాజలుచల్లారు. ఆ దృశ్యం మంథరాద్రిచే పాలసముద్రం చిలికినప్పుడు అందలి అలలు మహావిష్ణువుపై పాలతుంపరలు చల్లిన దృశ్యాన్ని స్మరింపజేసింది.

ఇంద్ర సమానుడైన ఆ రాజు అనుకూలమైన గాడ్పునకు రెపరెపలాడుతున్న జెండాలతో శత్రువులను బెదిరిస్తున్నడా అన్నట్లు ముందు తూర్పుదిశగా పయనించాడు. అప్పుడు రథం రేపిన దుమ్ముతో నిండిన ఆకసం భూతలంగానూ, మేఘాలవంటి ఏనుగులతో నిండిన భూతలం ఆకాశంలాగానూ కనిపించాయి. ముందు ప్రతాపమూ, తర్వాత దండుకలకలమూ, ఆ తర్వాత ధూళీ, దానితర్వాత రథగజాదులూ - ఈ విధంగా నాల్గు వ్యూహాలతో ఆ సైన్యం సాగిపోయి నట్లుండింది.

మహానమర్థుడైన రఘువు ప్రయాణానికి అనుకూలంగా ఎడారులలో నీటి వసతి ఏర్పాటు చేశాడు. పడవలపై దాటవలసిన మహానదులను సులభంగా దాటే వీలు కలిగించాడు. అడవులు కొట్టించి బయళ్లుచేశాడు. తూర్పు సముద్రంవైపు పయనిస్తున్న మహాసేనను నడిపించుకుపోతున్న ఆ రాజు శివుని జడనుండి జారిన గంగను వెంటబెట్టుకొని పోతున్న భగీరథునిలా భాసించాడు. మదపుటేనుగు దారిలో కొన్ని చెట్ల కాయలు రాలుస్తూ, కొన్నింటిని పెకలిస్తూ, కొన్నింటి కొమ్మలు విరుస్తూ ఎలా సాగిపోతుందో, అలాగే రఘువు కొందరు రాజుల నుండి లాభాలు స్వీకరిస్తూ, కొందరిని రాజ్యం నుండి తొలగిస్తూ, మరికొందర్ని ఓడిస్తూ నిరాటంకంగా ముందుకు సాగిపోయాడు.

ఈ విధంగా తూర్పు రాజ్యాలను ఆక్రమించి జయశీలుడైన రఘుమహారాజు తాటితోపులతో నల్లగా వున్న సముద్రతీరం చేరాడు. వంగనిచెట్లను పెకలిస్తూ, వస్తున్న ఏటి ప్రవాహానికి తలవంచి ప్రబ్బలిచెట్లు ఆత్మరక్షణ చేసుకొంటాయి. అలాగే అడ్డుతగిలిన వారందరినీ హతమారుస్తూ వస్తున్న రఘువుకు లొంగిపోయి సుహ్మాదేశస్థులు తమ్ము తాము కాపాడుకొన్నారు. ఓడలపై వచ్చి తనతో తలపడ్డ వంగదేశపు రాజులను ఓడించి రఘువు గంగలోని లంకలలో జయస్తంభాలను నాటాడు. ఓడిన వాళ్లు అతని పాదాలకు తలానించి నమస్కారాలు చేశారు. అప్పుడతడు మళ్లీ వాళ్ళను తమ తమ స్థానాలలోనే నిలిపాడు. పెరికి నాటిన పైర్లులాగా వాళ్ళు అతనికి ధనరూపమైన ఫలసమృద్ధిని గల్గించారు.

తర్వాత అతడు ఏనుగులను వంతెనగా నిల్పి దాని

మీదుగా దండుతో కపిశానది దాటి ఓఢ్రరాజులు చూపిన దారిలో కళింగదేశం చేరాడు. గంభీరవేది అనే మదపుటేనుగు తలపై మావటీడు చురుకైన అంకుశం నాటినట్లు, రఘువు మహేంద్రపర్వత శిఖరంమీద తీక్షణమైన ప్రతాపం ప్రదర్శించాడు. ఱెక్కలు నరకటానికి ఉద్యుక్తుడైన ఇంద్రుణ్ణి రాళ్ళవానతో కొండ ఎదుర్కొన్నట్లు, ఏనుగుదండు మెండుగా వున్న కళింగరాజు అస్త్రప్రయోగంతో అతణ్ణి ఎదుర్కొన్నాడు. శత్రువులనుండి వచ్చే శరవర్షానికి ఓర్చుకొని రఘువు మంగళాభిషిక్తుడైన వానిలా జయలక్ష్మిని చేకొన్నాడు. మహేంద్రాద్రిలో అతని సైనికులు పానగోష్ఠికి తగినచోట్లు ఏర్పాటు చేసుకొని తములపాకు దొన్నెలలో శత్రువుల కీర్తిని పోలిన టెంకాయకల్లు త్రాగారు. ధర్మం పాటించే రఘుమహారాజు కళింగరాజునోడించి పట్టుకొని మళ్ళీ వదిలేశాడు. అతడి సంపదను హరించాడే కాని భూమిని హరించలేదు.

తూర్పుదిక్కును జయించిన తర్వాత అతడు ఫలించిన పోకతోటలతో విలసిల్లుతున్న సముద్రతీరం వెంబడే నడిచి అప్రయత్నంగా విజయం పొందుతూ దక్షిణదిక్కుకు వెళ్లాడు. అతని సైన్యాలూ, గజాలూ అక్క .... నదిలో స్నానం చేసి అంగరాగాలతోనూ, మదజలంతోనూ కలుషితమైన ఆ నదిమీద సముద్రుడికి సందేహం కలిగేట్టు చేశాయి. తర్వాత జయేచ్ఛతో ముందుకు సాగుతున్న రఘుమహారాజు సైన్యాలు ఇంక కొంత ముందుకు వెళ్ళి మలయపర్వతం చెంత విడిశాయి. ఆ అలజడికి బెదిరి అక్కడి మిరియపుతోటల నుండి హారీత పక్షులు పైకెగిరిపోయాయి. అక్కడ గుఱ్ఱాల తొక్కిడికి నలిగిన ఏలకికాయలపొడి పైకెగిరి ఆలాంటి వాసనే కల మదపుటేనుగుల గండస్థలాలపై రాలింది. పాములు చుట్టుకోవటంవల్ల ఏర్పడ్డ చందనవృక్షల నఱదలలో మెడ గొలుసులను తగిలించి మదగజాలను కట్టివేశారు. కాలి గొలుసులను సైతం తెంపుకొనే ఆ యేనుగు లెంత లాగినా ఆ మెడకట్టులు సడలలేదు.

పాండ్య రాజులుండే దక్షిణ దిక్కుకు పోయినప్పుడు సూర్యుని తేజస్సుగూడ తగ్గిపోతుంది. ఆ దిక్కులోనే పాండ్యులు రఘుమహారాజు ప్రతాపం ముందర నిలబడలేకపోయారు. వాళ్లు అతనికి శరణాగతులయ్యారు. ఎంతో కాలం నుండి తామ్రపర్ణీసాగరసంగమస్థలంలో తాము సంపాదించి కూడబెట్టుకొన్న ముత్యాలరాశిని కీర్తిరాశిని సమర్పించినట్లు రఘువుకు సమర్పించారు.

చందనవ్యాప్తాలై దక్షిణదిక్కు అనే అంగనకు పాలిండ్లులా వున్న మలయదర్దుర పర్వతాలను రఘుమహారాజు యథేచ్ఛగా అనుభవించాడు. తర్వాత దుస్సహపరాక్రముడై అతడు వలువ తొలగిన భూదేవి నితంబంలా సముద్రానికి దూరంగా వున్న సహ్యాద్రిని దాటివెళ్ళాడు. అతని సైన్యాలు పడమటిదిక్కుగా వెళ్తూ సహ్యపర్వతానికీ, సముద్రానికీ మధ్య నడుస్తున్నప్పుడు సహ్యాద్రి పూర్వం పరశురామునిచే దూరీకరించబడిన సాగరంతో మళ్లీ సంగమించినట్లు కనిపించింది. మహోద్ధతంగా వస్తున్న ఆ సైన్యాలను చూచి భయపడి కేరళ స్త్రీలు ఆభరణాలు త్యజించి పారిపోయారు. ఐనా సేనల ధూళి వాళ్ళ ముంగురులపై బడి కుంకుమాలంకార శోభను కలిగించింది. మురళీనది నుండి వచ్చే గాలికి రేగిన మొగలి పూలధూళి సైనికుల కవచాలపై బడి అప్రయత్నంగా కల్గిన బుక్కాగా శోభిల్లింది. సాగిపోతున్న గుఱ్ఱపుదళాల కవచధ్వని అక్కడ గాలికి కదిలే తాటిచెట్ల చప్పుడును మించిపోయింది.

దండు విడిసినచోట ఏనుగులను చిట్టీత చెట్లకు

కట్టివేశారు. వెంటనే తుమ్మెదలు పొన్నపూలపై నుండి ఎగిరివచ్చి మదజలం కారుతున్న వాటి గండస్థలాలపై వ్రాలాయి. పూర్వం యాచిస్తే పరశురాముడికి సముద్రుడు చోటిచ్చాడు కాని రఘువుకు మాత్రం పడమటిరాజుల నెపంతో కిమ్మనకుండా కప్పం చెల్లించుకొన్నాడు. దండులోని ఏనుగులు త్రికూటపర్వతం మీద దంతాలతో గీసిన గీరలు రఘుపరాక్రమాన్ని ప్రకటించే అక్షరాలుగానూ, ఆ పర్వతం జయస్తంభంగానూ ఉపయోగపడ్డాయి.

తర్వాత ఇంద్రియాలనే శత్రువులను జయించడానికి యోగి తత్త్వజ్ఞానమార్గం అనుసరించినట్లు పారశీకులను జయించడానికి రఘుమహారాజు నేలబాటను అనుసరించాడు. అకాలంలో వచ్చిన మేఘం తామరలమీది లేత యెండను తొలగించినట్లే అతడు యవనులతో కయ్యానికి తలపడి వాళ్ళ వనితల ముఖాలనుండి మధుమదాన్ని తొలగించాడు. మెండైన గుఱ్ఱపుదండుగల ఆ పడమటి దేశపురాజులతో పోరు ఘోరంగా జరిగింది. అప్పుడు రేగిన దుమ్ములో ఎదుటి శత్రువులెవరికీ కనిపించలేదు. ధనుష్టంకారాల వినికిడినిబట్టి ఒకరిపై నొకరు బాణాలు ప్రయోగించుకొన్నారు. గడ్డాలూ, మీసాలూ దట్టంగా ఎదిగివున్న వారి తలలను రఘువు బల్లేలతో తెగవేశాడు. తెగి క్రిందపడ్డ ఆ తలలు తేనెటీగలు క్రమ్మిన తేనెపట్టుల్లా భూమిని క్రమ్మివేశాయి. చావు దప్పించుకొన్న మిగిలిన యవనులు శిరస్త్రాణాలను తొలగించుకొని ఆ మహారాజును శరణుజొచ్చారు. అతడు వాళ్లను మన్నించాడు. పెద్దల కోపం నమస్కారంతో శాంతిస్తుంది కదా!

రఘుమహారాజు సైనికులు అక్కడి ద్రాక్షతోటలో మేలైన చర్మాసనాలపై కూర్చొని మద్యం సేవిస్తూ అలసట తీర్చుకొన్నారు. తర్వాత సూర్యుడు కిరణాలతో నీరు పీల్చినట్లు బాణాలతో ఉత్తరదిక్కు రాజులను నిర్మూలిస్తూ రఘుమహారాజు పయనం సాగించాడు. అతని అశ్వాలు సింధునదీతీరంలో పొరలాడి మార్గాయాసం తీర్చుకొన్నాయి. పొరలడేటప్పుడు స్కంధాల కంటుకొన్న కుంకుమపూరేకులను అవి వొళ్లు దులుపుకొని రాల్చివేశాయి. అక్కడ హూణదేశపు రాజులు అతనితో సమరానికి తలపడ్డారు. అతడు అవక్రవిక్రమంతో వాళ్లను తెగటార్చాడు. వారి అంతః పుర స్త్రీలు మొగాలు ఎరుపెక్కేటట్లు బాదుకొంటూ రోదించారు. కాంభోజ రాజులు రఘువు పరాక్రమానికి తట్టుకోలేక అతని యేనుగుల కాలికట్ల లాగుడుకు వంగిన ఊడుగుచెట్లలాగా వంగిపోయారు. వాళ్ళతనికి మేలైన గుఱ్ఱాలతో సహా ఎత్తైన బంగారు రాసులను కానుకగా ఇచ్చారు. అయినా అత డందుకు గర్వపడలేదు.

తర్వాత అతడు అశ్వసహాయంతో హిమవత్పర్వతం ఎక్కాడు. అక్కడ గుఱ్ఱాలు లేపిన గైరికాది ధాతువుల ధూళి ఆ కొండశిఖరాలు పైకెగురుతున్నాయా అన్న భ్రమను కల్గించింది. సైన్యం పెద్ద కలకలంతో ప్రక్కన వెళ్తున్నా గుహలలో పడుకొన్న సింహాలు బెదరకుండా మెడలు త్రిప్పి వెనక్కు చూచి సైనికులతో సమానమైన బలం తమకున్నదని వ్యక్తం చేశాయి. మిన్నేటి తుంపురులతో చల్లబడి మెల్లగా వీస్తున్న అక్కడి గాలి భూర్జ వృక్షాలలో మర్మరధ్వనినీ, బొంగువెదుళ్ళలో మధురగానాన్నీ వెలయిస్తూ రఘుమహారాజును సేవించింది. సైనికులు సురపొన్నలక్రింద పడుకొన్న కస్తూరీ మృగాల కస్తూరితో గుబాళించే శిలాతలాలపై విశ్రమించారు. రాత్రివేళల్లో సరళవృక్షాలకు కట్టివేసిన ఏనుగుల మెడగొలుసులలో ప్రతిబింబించిన జ్యోతిష్మతీలతలు నూనెతో పనిలేని దీపాల్లా ఉపయోగపడ్డాయి. సైన్యం అక్కడినుండి వెళ్ళిన

తర్వాత ఏనుగుల మెడ గొలుసుల రాపిడితో ఎత్తున గుర్తులుపడ్డ దేవదారు వృక్షాలనుచూచి బోయవాళ్ళు ఆ గజాల దేహప్రమాణం ఊహించుకొని ఆశ్చర్యపడ్డారు.

అక్కడ రఘుమహారాజుకూ, ఉత్సవ సంకేతు లనబడే కొండరాజులకూ ఘోరమైన పోరాటం జరిగింది. అప్పుడు బాణాలూ, విసరివేసిన గుదియలూ, రాళ్లూ - వీటి రాపిడికి నిప్పులు కురిశాయి. చివరికి రఘువు శరపరంపర ప్రయోగించి వాళ్ళను జయించాడు. కిన్నరులు అతని విజయాన్ని ప్రశంసిస్తూ పాటలుపాడారు. ఆ పర్వతవాసులు అతనికి వెలలేని కానుక లర్పించారు. అప్పుడు మహాబలవంతులైన వాళ్లను ఓడించిన రఘుమహారాజు సారం హిమవంతుడికీ, అట్టి కానుకలకు నెలవైన హిమవంతుడిసారం రఘుమహారాజుకీ బోధపడింది. దిలీపసుతుడు అనంతమైన తన కీర్తిని హిమాద్రిపై ప్రతిష్ఠించాడు. పూర్వం రావణుడు ఉద్రూత లూగించిన కైలాసంపై మళ్ళీ తాను దాడి జరపడం తగదని కాబోలు కైలాసాన్ని సిగ్గుపడజేసేవానిలా అక్కడి నుండి క్రిందికి దిగివచ్చాడు.

తర్వాత అతడు లౌహిత్యానదిని దాటాడు. అప్పుడతని గజాలను కట్టివేసిన నల్ల అగరుచెట్లు వణికినట్లే ప్రాగ్జ్యోతిష రాజు గడగడ వణకిపోయాడు. సూర్యుణ్ణి కనిపించనీకుండా మేఘంలాగా ఆకసమంతా క్రమ్ముకొన్న రఘువు రథాల ధూళిని చూచే అతడు భయపడ్డాడు. ఇక సైన్యాన్ని చూస్తే ఏమయ్యాడో వేఱే చెప్పాలా ? కామరూపదేవపురాజు ఇతర రాజులను జయించడంలో తనకు ముఖ్యంగా ఉపయోగపడే మదగజాలను ఇంద్రవిజేత అయిన రఘుమహారాజుకు కానుకగా సమర్పించుకొని శరణాగతి చెందాడు. బంగరుపీట మీద నెలకొన్న అతని పాదకాంతిని దేవతను పూజించినట్లు రత్నాలతో పూజించాడు.

ఇలా జయశీలుడైన రఘుమహారాజు నలుదిక్కులనూ జయించి ఛత్రశూన్యమైన నరపతుల సిగలలో రథాల ధూళిని విశ్రమింపజేస్తూ రాజధానికి తిరిగివచ్చాడు. ఆపైన సర్వస్వాన్నీ దక్షిణగా సమర్పించే విశ్వజిద్యాగం చేశాడు. మేఘాలలాగా సజ్జనులు పుచ్చుకోవడ మనేది సత్పాత్రులకు ఇచ్చుకోవడానికే కదా !

యాగం పూర్తి కాగానే యుద్ధంలో ఓడి తన వెంబడి వచ్చిన రాజుల నందరినీ గొప్ప సత్కారాలు చేసి సంతోషపెట్టాడు. ఆపై వాళ్ళ అంతఃపురకాంతల చిరవిరహం తీరేటట్లు వాళ్లు తమతమ నగరాలకు తిరిగి పోవటానికి అనుమతించాడు. రేఖాధ్వజాది సార్వభౌమ చిహ్నాలతో విలసిల్లే రఘుమహారాజు పాదయుగళానికి సిగపూదండలు సోకేటట్లుగా మ్రొక్కి ఆ రాజులందరూ తమ తమ పట్టణాలకు తరలి వెళ్లారు. (సశేషం)

- అధిక వెలుగును భరించలేవు. చిమ్మచీకటిలో బ్రతుకనూ లేవు. జీవితంలో సుఖదుఃఖాలు కూడా అంతే ననుకో!
- ప్రపంచంలో కల్లా విలువైన ధనాగారం నీ హృదయంలోనే వుంది. దానిని పొందాలంటే మాత్రం ఆత్మజ్ఞానం అనే తాళం చెవిని ముందుగా నీవు సంపాదించగలగాలి.
- మంచి ఏదో తనకు తెలిసినా ఇతరులకు చెప్పలేని వాడే మూగవాడు. అలాగే ఇతరులు మంచి చెబుతున్నా వినలేనివాడే చెవిటివాడు.

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

ఎంతటి మహామహులైనా ఏకాంతంగా ఉన్నప్పుడు స్త్రీలను దగ్గరకు రానిస్తే పతనం తప్పదని మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంలోని మేనకా విశ్వామిత్రుల వృత్తాంతం చెప్తుంది.

విశ్వామిత్రుడు గాథె రాజు. సర్వశాస్త్రాల్లో పారంగతుడు, మహా పరాక్రమవంతుడు. ప్రజాహితంగా రాజ్యపాలన చేసినవాడు. కామధేనువు విషయమై బ్రహ్మర్షి వశిష్టునితో తలపడిన ధైర్యశాలి. క్షత్రియ బలము కంటే బ్రహ్మబలమే బలమని గ్రహించిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి పదాన్ని సంపాదించడం కోసం కఠోరదీక్షతో ఘోరమైన తపస్సును ప్రారంభిస్తారు. ఆయన తపోదీక్షను పరీక్షించదలిచిన ఇంద్రుడు అప్సరసలలో తలమానికమైన మేనకను పిలిపించి "ఓ మేనకా! నీ రూప లావణ్య, విద్యా ప్రావీణ్యాలతో విశ్వామిత్ర మహర్షి తపస్సమాధికి భంగం కలిగించాలి" అని అంటాడు. అందులకు మేనక "ప్రభూ! మీ మాటకు ఏనాడూ ఎదురు చెప్పింది లేదు. విశ్వామిత్రుల సామర్థ్యం మీరెరుగనిది కాదు. ఆయన తపస్సు, తేజస్సు మిక్కిలి ఘనమైనవి. వీటికి మించి ఆయన క్రోధమూర్తి. వశిష్టుల వారి కొడుకులందర్ని సంహరించాడు. పతంగుని చేత పట్టుబట్టి యజ్ఞం చేయించాడు. త్రిశంకునికి మరో స్వర్గాన్ని నిర్మించాడు. తన తపస్సుకి అంతరాయం కల్గిస్తుందని నదీ ప్రవాహాన్ని శబ్దరహితంగా ప్రవహింపజేసిన శక్తిశాలి. ఆయన కన్నులెర్రజేస్తే ముల్లోకాలూ గజగజ వణుకుతాయి. అటువంటి మహాశక్తి సంపన్నుడి దగ్గరకు నన్ను పంపుతున్నారు. మీ మాట కాదనకుండా వెళతాను అయితే పంచభూతాలు, మన్మధుడు నాకు సహకరించేలా చూడాలి'' అని అంటుంది. దేవేంద్రుడు ఆమె అడిగిన వాటన్నిటికీ తన అంగీకారాన్ని తెలియజేస్తాడు.

మేనక విశ్వామిత్రుడి తపోవన వాటికకు వచ్చేసరికి అక్కడి ప్రకృతి అంతా పరమశోభాయమానంగా మారిపోతుంది. పక్షుల కిలకిలా రాగాలతో ఆ ప్రాంగణమంతా వింత సంగీతానుభవం కల్గుతోంది. మేనక తన అత్యద్భుతమైన అభినయ విన్యాసాలతో విశ్వామిత్రుని మనస్సును చూరగొన్నది. కామక్రోధాలను జయించి బ్రహ్మర్షి పదం చేరాలనే ఏకైక సంకల్పంతో తపస్సునారంభించిన విశ్వామిత్రుడు ఏకాంతంలో పైట జారిన మేనక వంటి అందాలరాశి కన్పించేసరికి సర్వస్వమూ మరిచిపోయి మదనతాపానికి లోనైతాడు. మేనకను దగ్గరకు తీసుకుంటాడు. పది సంవత్సరాల కాలం ఒక లిప్తకాలంగా గడిచిపోతుంది విశ్వామిత్రునికి. అప్పటికి ఆయనకు అర్థమైంది తాను కామాన్ని జయించలేదని. తక్షణమే మేనకను విడిచి తపోవనానికి వెళ్ళిపోయాడు విశ్వామిత్రుడు.

ఇలాంటి ఎన్నో నీతి కథలకు ఆలవాలం మహాభారతం. మహాభారతంలో కన్పించని పాత్ర, కన్పించని మనస్తత్వం లోకంలో ఎక్కడా లేదంటారు. అందుకే

"యదిహాస్తి తదన్యత్ర
యన్నే హాస్తి నతత్ క్వచిత్" అని ప్రశంసిస్తారు.

మానవజీవితంలో పెనవేసుకుపోయిన పాత్రచిత్రణ ఈ గ్రంథంలో దర్శనమిస్తుంది. దీనివల్లే కొంతమంది విద్వాంసులు భారతాన్ని గొప్ప మనస్తత్వాల కూడలిగా భావిస్తారు. సమాజంలో, జీవితంలో ఎలా నడుచుకోవాలో చెప్తుంది భారతం. ఈనాటి సమాజంలో మనకు కన్పిస్తున్న సమస్త బడుగులకు మహాభారతం చక్కని పరిష్కారాలను చూపుతుందనడంలో ఎలాంటి సంశయం అక్కరలేదు. అందుకే మనందరం మహాభారతాన్ని మళ్ళీ మళ్లీ చదవాలి. ఆమూలాగ్రం అవగాహన చేసుకోవాలి. హృదయానికి పట్టేలా చదవాలి. చదివిన పిదప ఆచరణలో పెట్టాలి. అదే మనందరికీ శ్రీరామరక్ష.

# త్రివేణీ సంగమం

.... స్వర్ణశ్రీ

ఈ సృష్టి యావత్తూ భగవంతుని గృహమే. వారి గృహంలో మానవుడు తనకంటూ ఒక గృహాన్ని ఏర్పరచుకున్నాడు. ఎన్ని వృత్తులు, ప్రవృత్తులు ఉన్నా చివరికి తాను చేరుకునేది ఇంటికే.

ఉదయించే సూర్యుడు సాయం సంధ్య కల్లా పడమటి కనుమల చాటుకు కనుమరుగైపోతాడు. పక్షులు వాటి వాటి గూళ్ళకు అవి చేరుకుంటాయి. పశువులు అవి నిత్యం నివసించే చోటుకు తరలి వెళ్తుంటాయి. మనిషి కూడా తన వృత్తిని ముగించుకొని తన గృహానికి చేరుకుంటాడు.

ఈ విధంగా ఈ ప్రకృతిలో ప్రతిజీవి, ప్రతివ్యక్తీ సాయం సమయాని కల్లా తమ తమ విడిదికి చేరుకోవడంలో దాగి వున్న ఆంతర్యం? - అలసిన దేహానికి విశ్రాంతి నివ్వడమే!

దేహానికి తగిన విశ్రాంతి నిస్తున్నాము. సరే! మరి అలుపెరుగని ఆలోచనలతో పరుగులిడే మనసుకు కూడా విశ్రాంతి నివ్వాలి కదా! విశ్రాంతిలో శాంతి ఉన్నది. శాంతిలో ఆనందమున్నది. ఈ శాంతి, ఆనందము కోసమే కదా మనిషి తన దేహానికి కొన్ని అపథ్యపదార్థాలను (కాఫీ, టీ, మద్యపానము.....) అందచేస్తున్నది? ఈ శాంతి ఆనందము కోసమే కదా తాను తన మనసుకు కొన్ని దుర్విషయములను అలవాటు చేస్తున్నది? తాను అలవాటు చేసుకునే విషయాలన్నీ దుర్విషయాలు కాకపోవచ్చు. అలాగని అవి తనకు పూర్తి మేలు చేస్తున్నాయని కూడా చెప్పలేము.

ఏ శాంతి కోసం, ఏ ఆనందం కోసం తాను విషయాలను అనుభవిస్తున్నాడో అవి తనకు శాంతిని యివ్వాలి. తన ఉన్నతికి తోడ్పడాలి. ఆనందాన్ని పంచాలి. ఆరోగ్యాన్ని పెంచాలి. కాని భౌతిక విషయాలు శాంతిని ఇచ్చినట్లే యిచ్చి అశాంతికి గురిచేస్తున్నవే! ఆనందాన్ని పంచినట్లే పంచి అనారోగ్యాన్ని పెంచుతున్నవే!

మరి ఏమిటి దీనికి పరిష్కారం?

సర్వదా యోగ్యమైన యోగమార్గాన్ని ఎంచుకొని ఆ మార్గం ద్వారానే నీవు కోరుకునే శాంతిని, ఆనందాన్ని పొందడమే దీనికి తగిన పరిష్కారం.

నీవు విశ్రమించడానికి నీ ఇంట్లోనే నీకంటూ ప్రత్యేకమైన చోటొకటున్నట్లు నీ మనస్సు కూడా విశ్రమించడానికి దానికి దేహమనే నీ యింట్లోనే ఒక ప్రత్యేకమైన పరమపవిత్రమైన చోటు ఒకటి వుంది. అది గంగా, యమునా, సరస్వతుల త్రివేణీ సంగమ స్థానం.

మందర, కైలాస, మహామ్మేరు గిరులకు అది నివాస స్థానం.

దివ్యజ్ఞానకాంతినీ ప్రసరించే సౌజ్ఞాశ్రీసూర్య నారాయణులకు నిలయమది.

చిత్రమైన కళలు, చిత్కళలను వెదజల్లే "త్రికూట" మది.

తన దివ్య దర్శనాలతో నీ నేత్రేంద్రియమునకు నయనానందము గొల్పి,

తన దివ్య నాదములతో నీ కర్ణేంద్రియమునకు లయయోగము నేర్పి,

తన దివ్య పరిమళముతో నీ ఘ్రాణేంద్రియములను పరవశింపజేసి

తన దివ్యామృతముతో నీ జిహ్వేంద్రియమునకు షడ్రుచులను చూపించి

ఇలా సకలేంద్రియములకును మనసునకును దివ్యానుభూతులను చేర్చి కూర్చే 'యోగనిలయ'మది.

అదే త్రివేణీ సంగమ స్థానం. దీనినే త్రిపుటి, భృకుటి అని కూడా అంటారు. భృకుటి అనగా భ్రూమధ్యస్థానం.

ఈ స్థానానికంతటి ప్రాముఖ్యత ఉంది కాబట్టి పెద్దలు ఈ స్థానంలో 'తిలకధారణ' మనే సంప్రదాయాన్ని ఏర్పాటు చేశారు. అట్టి భృకుటిని మనకి పరిచయం చేసేవారు - సద్గురువు.

అందున్న పరమాత్మతో ధ్యానప్రక్రియ ద్వారా మనకు మచ్చిక కుదిర్చేదీ - సద్గురువే.

పరమాత్మతో మచ్చిక 'నాకు మనఃశాంతి కావాల'నే ఎన్నో యేళ్లనాటి తన ముచ్చటను తీరుస్తుంది.

ఆ శాంతిలో దివ్యశక్తి ఉన్నది.

ఆ శక్తియే దివ్యౌషధమై దేహ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

వజ్రకవచమై మనసును బలహీనతల నుండి కాపాడుతుంది.

పరిష్కారకర్తయై జటిల సమస్యలను సైతం సున్నితంగా పరిష్కరిస్తుంది.

సంస్కరణకర్తయై నీలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే దొంగలను సంహరించక సంస్కరించి - నిష్కామ, శాంత, దానశీల, నిర్వికార, నిరహంకార, నిష్కపటులనే యోగ్యులుగా తీర్చిదిద్దుతుంది.

ప్రశాంతత.... ఆనందం... ఆరోగ్యం.... పరిష్కారం..... సంస్కరణ ఇలా ఎవరికేది ఎప్పుడు కావాలనుకున్నా గురుకృపతో త్రివేణీ సంగమంలో తన యిష్టదైవధ్యానాన్ని ఆరంభించవలసిందే. ఆస్వాదించవలసిందే.

పదపదండి త్రివేణీ సంగమానికి, నిర్మల ధ్యానానికై.... త్వరపడండి నిత్యశాంతికై.

ఓం ప్రశాంతిః ●

---


20 వ పేజి తరువాయి ......

"శాతనభాగ్రఖాండిత", "కుక్షి ప్రోద్భవ నిష్ఠురక్షుభిత దుష్క్రోధాంధ కారంబునన్" వంటి పద్యాలు వింటున్నప్పుడు ఆయా పాత్రలు కళ్లముందు కన్పిస్తాయి. "కుప్పించి ఎగసిన కుండ లంబుల కాంతి గగన భాగం బెల్ల గప్పి కొనగ".... అనే ఒక్క పద్యం చాలదా ఇదంతా చాలా స్వాభావికమని చెప్పడానికి!

ధారుణిరాజ్య సంపద మదంబున, కురువృద్ధుల్ కురువృద్ధ బాంధవుల నేకుల్, నుతజల పూరితంబులగు నూతాలు నురిటి కంటె, సాల ప్రాంశునిజోజ్వల త్కవచుశశ్వత్కుండ లోద్భాసితున్‌వంటి పద్యాలు పిక్టోరియల్ ఎఫెక్ట్ కలిగి ఉండి ఆయా సన్నివేశాలను మన కళ్ల ముందు నిలుపుతాయి. విశ్వరూప సందర్శనం కూడా అలాంటిదే. ఎంతో భావోద్రేకంతో నిలచిన కృష్ణుడిలో అతడి మాటల్లో అర్జునుడు యావత్ప్రపంచాన్నే అవలోకించడమే కాక కొంచెం కలతకూడా చెంది ప్రసన్నుణ్ణికమ్మని వేడుకున్నాడు. ఇది కూడా చాలా స్వాభావికమే. సర్వసాధారణమే. (సశేషం)

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు



## వేములవాడ (తూర్పు గోదావరి - ఆంధ్రప్రదేశ్)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

వేములవాడ ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో కరప మండలంలో ఉంది. ఇది భీమకవి జన్మించిన ప్రదేశం.

భీమ ఖండములో భీమకవి గురించి ఉన్నట్లు తెలియుచున్నది. అయితే భీమకవి జన్మించినది తూర్పు గోదావరిజిల్లాలోని వేములవాడా లేక కరీంనగర్ జిల్లాలోని వేములవాడా అనే సందేహం ఉన్నప్పటికీ భీమకవి కీర్తించిన ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయం, వేములవాడకు 13 కి.మీ. దూరంలో ఉంది. దీన్ని బట్టి భీమకవి జన్మించినది ఇక్కడేనని తెలియుచున్నది.

ఈ గ్రామంలో బ్రాహ్మణులు అధికంగా నివసించటం వలన దీనికి బ్రాహ్మణ అగ్రహారం అనే పేరుండేది. పూర్వం భక్తులు ద్రాక్షారామ భీమేశ్వరుని పూజిస్తూ వరాలు పొందేవారు. భీమకవి తల్లిదండ్రులకు సంతానం లేక భీమేశ్వరుని ప్రార్థించగా వారి భక్తికి మెచ్చి భీమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకొనమనగా ఆ బ్రాహ్మణ దంపతులు పుత్రభిక్ష పెట్టమని కోరారు. భీమేశ్వరుడు మీకు ఐదవ తనంలేని ఆడ శిశువుగాని లేక పితృఋణం లేని మగశిశువుగాని జన్మిస్తుందనగా ఆ దంపతులు మగశిశువైతే వంశాభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో మగశిశువునే కోరుకొనడంతో భీమేశ్వరుడు వరం ఇచ్చి అంతర్థానమయ్యాడు. అయితే వరసిద్ధి ప్రకారం భీమకవి తల్లి కడుపున పడటంలో తండ్రి మరణించాడు. తరువాత భీమకవి జన్మించాడు. తండ్రిలేకుండా పుత్రుడు ఎలా జన్మించాడని ఎక్కడకు వెళ్ళినా అందరూ భీమకవిని ఎగతాళి చేసేవారు. దానికి కలత చెందిన భీమకవి తన తండ్రి ఎవ్వరని తల్లిని నిలదీయగా ద్రాక్షారామ భీమేశ్వరుడే నీ తండ్రి అని చెప్పి భీమకవికి ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆమె కన్ను మూసింది.

భీమకవి ద్రాక్షారామ భీమేశ్వరుని ప్రార్థించగా భీమేశ్వరుడు ప్రత్యక్షమై తను అన్నది జరిగే విధంగా వరాన్ని పొందాడు. అనంతరము తిరిగే వేములవాడరాగ ఆ సమయంలో విందు జరుగుతుండగా అందరితో కలసి భీమకవి భోజనం చేస్తుండగా కొంతమంది ఆకతాయలు భీమకవిని ఈడ్చుకొని ఊరి చివరగల దిబ్బ దగ్గరకు తీసుకువచ్చి వెలివేశారు. ఈ దిబ్బనే భీమకవి దిబ్బగా నేటికీ పిలుస్తారు. భీమకవికి కోపం వచ్చి భోజనంలో వడ్డించిన అప్పడాలన్నీ కప్పలుగాను, బూరెలన్నీ రాళ్ళుగాను, అన్నం సున్నంగాను మారాలని శపించగా అలాగే జరిగిందంట. అప్పుడందరూ భీమకవిలో దైవాన్ని చూచి విషయాన్ని భీమకవి ద్వారా తెలుసుకొని నాటి నుండి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారట.

తరువాత భీమకవి దేశాటన ప్రారంభించాడు. మార్గమధ్యంలో ఒక పట్టణంలో రాజాగారి కోటలో

ప్రవేశించి రాజును పిలువగా ఆ సమయంలో రాజు శృంగార సరస సల్లాపములలో మునిగి తేలుతుండగా భీమకవి రాకను తెలుపగా అతడు భీమ కవిని నిగ్గదీసి మాట్లాడటంతో భీమకవి విషయం భటుని ద్వార తెలుసుకొని నీవు ఇలాగే కాలక్రమేణా అనారోగ్యానికి గురవుతావు అని శపించెను. తరువాత రాజు అనారోగ్యానికి గురై భీమకవిని దర్శించుకొని మరలా తిరిగి అరోగ్యవంతుడయ్యాడు.

ఇలాగే వేరొక పట్టణంలో రాజు దర్శనార్థం వెళ్ళగా భీమకవి మాటలు విశ్వసించక పోవడంతో భీమకవి ఏమిచేస్తే విశ్వసిస్తారన్న మాటకు రాజు ఎన్నో ఏళ్ళ తరబడి చనిపోయివున్న పెద్దవృక్షాన్ని చూపించి దీనిని బ్రతికించి చిగురిచ్చే విధంగా చేయమనగా అలాగే చేశాడట. దీనితో రాజు భీమకవిలో దైవాంశ సంభూతుడ్ని చూచి ఆయనను భక్తి (శ్రద్ధలతో) పూజించాడట.

ఒకసారి భీమకవిని చూసి ఒకడు పూలకుండీపై కాళ్ళు పెట్టి ఎగతాళి చేస్తుండగా భీమకవి ఆగ్రహం చెంది అతని కళ్ళు పూలకుండీకి అతుక్కు పోవాలని శపించగా అలాగే జరిగిందంట.

ఇలా అనేక ప్రదేశాలు తిరుగుతూ తన 16వ సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలోని ఒక గ్రామం చేరుకొని అక్కడ నివసిస్తుండగా భీమకవిలో దైవాన్ని చూసిన ప్రజలు కాలక్రమేణా ఆ గ్రామాన్ని భీమకవి పేరు స్తుతిస్తూ వేముల వాడగా మార్చుకొన్నారట.

దేశాటన చేస్తూ అనంతపురం జిల్లాలోని 'కడేకల్లు' తనువు చాలించినట్లుగా తెలియుచున్నది.

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వేములవాడలో ఆనాడు భీమకవిని వెలివేసిన భీమకవి దిబ్బను పాటినేడి సత్యనారాయణమూర్తి, రుద్రయ్యలు కొనుక్కొని సాగుచేసుకోవటానికి ప్రయత్నించగా అక్కడ చిన్ననాటి ఆటవస్తువులు కొన్ని ఆధారాలు లభించడంతో వారు ఆ పనిని విరమించుకొని తుల్యభాగ నదీతీరాన భీమకవి తండ్రి భీమేశ్వరునికి స్థలాన్ని దానం చేసి గ్రామస్తుల సహకారంతో దేవాలయాన్ని నిర్మించారు. వీరు ఆలయానికి పంట భూమినికూడా దానం చేశారు.

నాటి నుండి నేటి వరకు ఈ గ్రామానికి భీమకవిని వెలివేసిన కారణంగా గ్రామంలోపల ఎక్కడ చూచినా మంచి నీరు పుట్టదు. బ్రాహ్మణ వంశవృద్ధి చెందదు. అన్న శాపకారణంగా నాడు బ్రాహ్మణ అగ్రహారంగా పేరొందిన ఈ గ్రామంలో చాలా తక్కువ కుటుంబాలు ఉండటం విశేషం. గ్రామంలోపల ఎక్కడ చూసినా ఉప్పునీరే. ఊరు బయట ఎక్కడ తవ్వినా మంచినీరే. ఇది భీమకవి శాపంగా చెబుతారు.

నేటికీ ఈ వేములవాడలో నీరు పుట్టదు. బ్రాహ్మణవంశంవృద్ధి చెందదు అనే నానుడి ఉంది.

ఇక్కడ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ, అమ్మవారి విగ్రహాలు కలవు . శివరాత్రి ఉత్సవాలు ప్రధానంగా జరుగుతాయి.

- నిన్ను నీవు తీర్చిదిద్దుకునేంత గొప్పగా ఇతరులెవరూ నిన్ను మార్చలేరు.
- పైరు నుండి కలుపు మొక్కలను తొలగించనిదే పంట చేతికి రాదు. మనస్సు నుండి విషయాలను నిగ్రహించనిదే ఆత్మజ్ఞానము సిద్ధించదు.
- దేనికైనా ప్రయత్నించేముందు దానికి కావలసిన అర్హతను ముందుగా సమకూర్చుకోవాలి.
- శ్రద్ధ, కృషి ఎవరి చెంత వుంటాయో వారి వెంట భగవంతుడు వుంటాడు.

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**45. గుండె అదురుట /దడ :** వేయించిన జీలకర్ర పావుతులం, పచ్చి జీలకర్ర పావు తులం, పంచదార అరతులం కలిపి సేవించిన యెడల గుండె అదురు తగ్గిపోవును.

- మారేడు చెట్టువేర్ల బెరడు కషాయాన్ని పూటకు 4 చెంచాలు తీసుకొనుచుండిన దడ తగ్గిపోవును.

**45. గుండె జబ్బులు :** పిప్పలి కట్ట, యాలకుల గింజలు రెండు సమభాగాలుగా చూర్ణము చేసి పూటకు 2 గ్రాముల నుండి 3 గ్రాముల చొప్పున నేతితో సేవించిన గుండెజబ్బులు హరించును.

- మద్దిచెక్క చూర్ణము పూటకు 2-3 గ్రాములు తేనెతో సేవించిన అన్ని రకాల గుండె జబ్బులు నయమై గుండెకు బలము వచ్చును.

- రోజు కప్పు వేడినీటిలో 4 చెంచాలు తేనె కలుపుకొని త్రాగితే గుండె జబ్బులన్నీ పోతాయి. రోజూ ఉదయం, సాయంత్రం అలా త్రాగుచుండాలి.

**46. గుండె మంట హరించుటకు :** పుచ్చగింజలు 2 తులాలు రాత్రి సమయములో నీటిలో నానబెట్టవలెను. ఉదయం ఆ నీటిలో ఆ గింజలను బాగా పిసికి పటిక బెల్లం పొడి కొద్దిగా కలుపవలెను. తరువాత దానిని వడపోసి ద్రవమును త్రాగవలెను.

**47. గుండె బలానికి :** పండిన గంగరావిచెట్టు (గంగిరేణిచెట్టు) ఆకుల రసం 5 తులాలు, పటిక బెల్లం 3 తులాలు కలుపుకొని ప్రతి నిత్యము త్రాగుచుండిన కఫ రోగములు హరించి, గుండెకు బలము కలుగును.

- రోజూ ఉదయం కరక్కాయ పై పెచ్చుల చూర్ణము రెండు కంది గింజలంత తీసుకొని తేనెతో సేవిస్తే గుండెకు బలం వస్తుంది.

- యాలక్కాయలు గుండెకు చాలమంచి టానిక్కులాంటిది. వీటిని అప్పుడప్పుడూ తింటూవుంటే గుండెకు నమ్మకంగా మంచి బలం వస్తుంది.

- సాంబ్రాణి పొగ కూడ గుండె వ్యాధులను తగ్గిస్తుంది. రోగుల గదులను రోజుకు రెండుసార్లు సాంబ్రాణి పొగతో నింపుచుండాలి.

**48. ముసిలితనము హరించుటకు :** వెండి భస్మము (రజిత భస్మం) పూటకు 1 గ్రాము నుండి 2 గ్రాముల చొ॥న రోజుకు 2 పూటలా నెయ్యితో కలిపి తినుచుండిన యెడల 2-3 మాసములలో ముసలితనం హరించును.

- మేడిపండులోని గింజలను తీసి యెండబెట్టి, చూర్ణము గొట్టి పూటకు పావుతులం నిమ్మకాయంత ఆవు వెన్నతో కలుపుకుని తినుచుండిన ముసలితనం పోవును.

**49. బలము, వీర్యవృద్ధి, నేత్రములకు దివ్యదృష్టికి, మేహశాంతికి రసాయన చికిత్స :** తాటిబెల్లమును మర్రిపాలతో తడిపి ముద్దగా తయారు చేసుకొని, ఉదయం, సాయంత్రం కుంకుడు కాయంత ముద్ద తినుచూ ప్రతిరోజు ఉదయం నిమ్మరసం త్రాగుతూ, సాయంకాలం ఆముదపు ఆకులు తలకు కట్టుకొని, గుడ్డతో తలపై కట్టు గట్టిగా కట్టుకొని, రాత్రి పరుండబోవు ముందు గేదె వెన్నతో గంటసేపు రెండు అరికాళ్ళను మర్దన చేయించుకొనుచుండవలెను. ఈ మూడు విధానములు 40 దినములు చేయుచుండినచో దేహబలము, బుద్ధిబలము, నేత్రములకు దివ్యదృష్టి, మేహశాంతి కలుగును.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ,, రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

### డబ్బు భద్రపరచవలసిన ప్రదేశం

ప్రస్తుతము ప్రపంచంలో ప్రతి పనీ డబ్బుతోనే ముడిపడివుంది. పరిణామ క్రమంలో ఈ వస్తు మార్పిడి పోయి, డబ్బు వినియోగంలోనికి వచ్చినపుడు, డబ్బు ఇన్ని పనులు చేస్తుందని, చేయిస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. ధనలక్ష్మి, ఎల్లప్పుడూ మన ఇంటిలో పదిలంగా ఉండాలంటే, జాగ్రత్తగా మనం మంచి స్థానాన్ని చూపించవలసిందే. అనేక మంది నగదు బీరువాలను నైఋతిలో వుంచడం మనం నిత్యం గమనిస్తూ ఉంటాం. నైఋతిలో నగదు మనకు ఉపయోగపడదు. దండగ ఖర్చులకు, ఇతర అవసరాలకు అది వస్తూ పోతూవుంటుంది. బీరువా బరువు కాబట్టి, బీరువాని నైఋతిలో పెట్టుకోమని చెప్పటం జరుగుతుంది. కాని, నగదు బీరువాని గాని, పెట్టెనుగాని, భోషాణం గాని ఉత్తర వాయవ్యంలో గాని, ఉత్తర మధ్యలో గాని పెట్టుకోవడం ఉత్తమం.

నైఋతిగదిలోగాని, లేదా వాయవ్యగదిలోగాని, ఉత్తర వాయవ్యంలో దక్షిణ ముఖం చేసిన నగదు బీరువాని కాని, పెట్టెనుగాని, నగదు కౌంటరునుగాని ఏర్పాటు చేసు కోవాలి. ఉత్తర కుబేర స్థానం కదా, దక్షిణం ముఖం చేసి ఉండటమేమిటని మీకు అనుమానం రావడం సహజం. అయితే, ఇందులో ఒక చిన్న విషయం ఉంది. అది ఏమిటంటే, మనం బీరువాలో డబ్బు పెట్టేప్పుడుగాని, తీసెటప్పుడుగాని, ఉత్తరం చూస్తూ ఉండాలి. కావున ఉత్తర వాయవ్యంలో దక్షిణ ముఖ్యంగా ఏర్పాటు చేస్తే నగదు నిల్వ చేసే కౌంటరు (బీరువా / భోషాణం) మన జీవిత సుఖ సంతోషాలకు నిలయమవుతుంది. అదే విధంగా, నగదు బీరువాను, ఉత్తర మధ్యమంలో దక్షిణ ముఖంగా పెట్టడం కూడా ఉత్తమమైనదే. ఉత్తరపు దిక్కు బుధుడిది. అతడు ధనాధిపతి మరియు వ్యాపారాధిపతి. కావున ఉత్తర మధ్యమంలో నగదును ఉంచడం వలన ధనాదాయం గొప్పగా పెరుగుతుంది.

ఆగ్నేయంలో నగదు బీరువా మంచిది కాదు. అందులో వుంచిన ధనం పరాయి వారి పాలవుతుంది లేదా అనవసరంగా ఖర్చయి ఎవరికీ ఉపయోగపడదు. ఈశాన్యంలో నగదు బీరువా తగాదాలు తెచ్చి పెడుతుంది. ఎవ్వరికీ ఉపయోగపడదు. అది అలా నిల్వ వుండి పోతుంది. వాయవ్యంలో వీలుకానపుడు, నగదు బీరువాను తూర్పు మధ్యలో ఏర్పాటు చేసికోవచ్చును. దీని వలన దండగ ఖర్చులుండవు. కాని, యజమాని, ఆ డబ్బును విలాసాలకు ఖర్చుపెట్టుకోవడం జరుగుతుంది. పడమర మధ్యలో బీరువాలో డబ్బు దాయడం వలన డబ్బు ఎక్కువగా ఖర్చు అవుతుంది. కాని, మన అవసరాలు తీరవు. దక్షిణం మధ్యలో నగదు బీరువాను ఏర్పాటు చేసుకోవడం వలన డబ్బు నిల్వ వుంటుంది. వ్యాపారాభివృద్ధి వుంటుంది. కాని, తన అవసరాలకు ఖర్చు పెట్టుకోకుండా, డబ్బు నిల్వ చేయాలనే తలంపుతో, ఆ యజమాని వుండటం జరుగుతుంది.

నగదు జాగ్రత్త చేసికొనే ప్రదేశాలను, మనం పరిశీలిస్తే

1) అన్నింటికంటే ఉత్తమమైన ప్రదేశం - ఉత్తర వాయవ్యం

2) ఆ తరువాత స్థానం - ఉత్తరం మధ్య

3) ఆ తరువాత తూర్పు మధ్యలో లేదా దక్షిణం మధ్యలో - పైవి రెండూ వీలుకానప్పుడు, ఫరవాలేదు.

**నగదు ఉంచకూడని ప్రదేశాలు**

నైఋతి, ఆగ్నేయం, ఈశాన్యం, పడమర మధ్యలో - ఈ ప్రదేశాలలో నగదు భద్రపరచడం మంచిది కాదు.

ఈ మధ్య కాలంలో, చాలా మంది చైనీయుల వాస్తును గూడ చూస్తున్నారు. దాని ప్రకారం కూడ ధనస్థానం వాయవ్యమే.

పైన చెప్పిన విషయాలను పరిగణనలోనికి తీసికొని, పాఠకులు తమ నగదును, ఉత్తర వాయవ్యంలో భద్రపరుచుకోవడం ద్వారా, ధనాభివృద్ధి తద్వారా సకల సంతోషాలు పొందుతారని ఆశిస్తూ.

# వార్తాసుధ

## వైభవంగా ముగిసిన ఆరాధనోత్సవాలు

శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి ఆరాధనా గురుపూజా మహోత్సవాలు బ్రహ్మంగారి మఠంలో అత్యంత శోభాయమానంగా ముగిశాయి. వైశాఖ శుద్ధ దశమీన వేలాదిగా తరలివచ్చిన వీరబ్రహ్మేంద్రస్వాములవారి దీక్షావరులకు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరభోగవసంత వేంకటేశ్వరస్వాములవారి సమక్షంలో దీక్షా విరమణ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం 12 గం॥లకు మఠాధిపతులవారు సంహసనాధిష్టులై భక్తులకు దర్శనమిచ్చారు.

ఏకాదశి రోజున బ్రహ్మరథోత్సవం. ప్రకృతి ఉరుములు మెరుపులతో చిరుజల్లు చిలకరించి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చింది. తడిసిన శరీరాలతో వేలాదిగా బక్తులు బ్రహ్మరథోత్సవాన్ని జై వీరబ్రహ్మ జై -గోవిందమాంబ జై అంటూ నగరవీధులగుండా నిర్వహించారు.

ద్వాదశినాడు మహాప్రసాద వినియోగం జరిగింది. ప్రసాదం తీసికొన్న భక్తులు ఆనందంగా తిరుగు ముఖం పట్టారు. ఈ అయిదు రోజులు కందిమల్లాయపల్లెలో, బ్రహ్మంగారి హరికథ, నాటకాలు, భజనలతో అపర వైకుంఠ ధామంగా విరాజిల్లింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యంలేకుండా చలువ పందిల్లు వేసి మంచి నీటికి కొదువలేకుండా సదుపాయంచేసినారు. అనేక ధార్మిక సంస్థలు అన్నదాన సమాజాలు వచ్చిన భక్తులకు ప్రీతితో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసుశాఖ, రెవిన్యూశాక ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఆరాధనా గురుపూజ మహోత్సవాలు ముగిశాయి. అన్ని డిపోల నుండి ఆర్.టి.సి. వారు ప్రత్యేక బస్సులు నడిపి భక్తులకు సౌకర్యం కలిగించారు.

తోట్లవల్లి శ్రీ అచలానంద ఆశ్రమంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి ఆరాధనా గురుపూజా మహోత్సవాలు తేది 26-4-2015 నుండి తేది 30-4-2015 వరకు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా 14 రోజులపాటు 24 టీములకు క్రికెట్ పోటీలు గ్రామీణ యువకుల ఆధ్వర్యంలో కనువిందుగా నిర్వహించారు. వీటికి రాయపురెడ్డి రమణారెడ్డిగారు ఆర్థిక, హార్థిక సహకారం అందించడు.

తేది 27-4-2015న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి శాంతి యజ్ఞం ఆశ్రమ శిష్యవర్గ పర్యవేక్షణలో నిర్వహించారు. గం॥11-00ల నుండి శ్రీ వీరబ్రహ్మేంద్ర సాంస్కతిక కళాపీటం వారి ఆధ్వర్యంలో 'కాలజ్ఞాన తత్వాలు' గానం పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతితో బాటు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. సాయంత్రం మహిళలలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలకు అనేక ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు ప్రేక్షకులను అలరించాయి.

రాత్రి గం.. 7-00లకు శ్రీ హరేరాం - మైదుకూరు

వారి ఇంద్రజాల ప్రదర్శన జరిగింది. హస్తలాఘవాన్ని తిలకించిన ప్రజలు ఆనందోత్సాహాలు కనబరచారు.

తేది 28-4-2015న బ్రహ్మంగారు సజీవసామాధి నిష్ట వహించిన పవిత్రదినం. మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని అనేక మంది స్త్రీలు పోటీలో పాల్గొన్నారు. ప్రతి సం॥ ఇంటింటి నుండి వంటల పోటీలో పాల్గొనాలని అందరు భావించారు.

రాత్రి గం. 8-00లకు గుంటూరు జిల్లా, సోమేశ్వరాయ, విష్ణ్వేశ్వరాయ కూచిపూడి కళా బృందం ప్రదర్శన అందరినీ ఆకర్షించింది. ప్రత్యేకించి అదిగదుగో, తోట్లపల్లి అచలానంద ఆశ్రమాన" అనే పాటకు అభినయం అందరిని ఆనందంలో ముంచింది.

తేది29-4-2015న ఉదయం ఆశ్రమ ప్రాంగణంలో తోట్లపల్లె గింగిరెడ్డిపల్లె, నరిశిరెడ్డి పల్లె గ్రామస్తుల ఆర్థిక సంపూర్ణ సహకారంతో నిర్వహించిన వృషభరాజముల బండలాగుడు పోటీలు గ్రామీణులను విశేషంగా ఆకర్షించింది. 6 జతల ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. నగదు బహుమతులను నిర్వహకుల తరపున శ్రీ విరజానందస్వాముల వారు అందజేశారు.

బ్రహ్మంగారి రథోత్సవం సమయంలో ప్రకృతి చల్లబడి జల్లులు కురియడంలో ఆనందించారు భక్తులు. రాత్రి గం॥8-00లకు శ్రీ భజన పుల్లయ్యగారి ఆధ్వర్యంలో 70 మంది జానపద కళాకారులు చెక్కభజన, కోలాటం, జడకోపు నిర్వహించారు. ఈ మూడు కళాబృందాలు ఒకేసమయంలో ఒకేపాటకు మూడు విధాలైన జానపద రీతులను ప్రదరింశంచి ప్రేక్షకులను ఆనంద పరవశుల్ని చేశారు. జానపద కళలను ప్రయోగాత్మకంగా ప్రథమంగా ఈఆశ్రమంలో నిర్వమించడం ఒక ప్రత్యేకత.

ఆరాధన గరుపూజా మహోత్సవాలకు విచ్చేసిన లక్షలాది భక్తులకు 'గోవిందమాంబ' అన్న ప్రసాదశాలలో షడ్రసోపేత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు టి.వి.యస్.యం. స్కూలు, చిన్నగురువలూరు డి.ఇ.డి విద్యార్థులు, పోరుమామిళ్ళ కృష్ణశారద డి.ఇడి. విద్యార్తులు 140 మంది పాల్గొని మూడు రోజులపాటు వడ్డనలోను కార్యకర్తలు క్రమశిక్షణాయుతంగా ప్రశాంతంగా, పరిశుభ్రంగా భోజనశాలలో నిర్వహించారు. తమ సేవలు అందించి అందరిమన్ననలు పొందారు.

తోట్లపల్లె, గంగిరెడ్డిపల్లె, నరిసిరెడ్డిపల్లె గ్రామస్తులు సహకారంతో అచలానంద ఆశ్రమంలో జరిగే ప్రతి కార్యక్రమానికి అనేక విధాలుగా ప్రత్యక్షంగా పరోక్షంగా, సహాయాన్ని అందిస్తూ కార్యకర్తలుగా తమసేవలు అందించారు.

వేసవితాపం కొంత చల్లబడి ఆరాధనోత్సవాలు ప్రశాంతంగాముగిసినందున ప్రజలు ఆనందించారు. ఆశ్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఈశ్వరరెడ్డి, సి.వి. సుబ్బారెడ్డిగారు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించినందుకు గ్రామీణులందరిని పేరుపేరునా శ్రీ విరజానందస్వాములవారు అభినందించారు.

## ఒంగోలు, అచలానంద ఆశ్రమములో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన

మహోత్సవాలు తేది 25-4-2015 నుండి
తేది 29-4-2015 వరకు జరిగాయి.

తేది 25-4-2015 ఉదయం గం॥6-00ల నుండి తేది 26-4-2015 ఉ. 6గం॥ల వరకు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి నామము జైవీరబ్రహ్మాజై - గోవిందమాంబ జై.., జై వీరబ్రహ్మాజై - అచలానందస్వామి జై అను సంకీర్తన ఏకాహము

జరగినది. తేది 27-4-2015సా. 7 గం॥లకు నుండి శ్యామలా నాట్య కళా అకాడమీ కుమారి పార్వతీరామచంద్రన్ బృందంవారిచే భరతనాట్యం ప్రదర్శించబడినది. ఈ నాట్య ప్రదర్శన ఆహుతులను అలంకరించింది.

తేద 28-4-2015 శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన పర్వదినం సందర్భంగా ఉ.8 గం॥ల నుండి శ్రీ వీరబ్రహ్మేంద్ర విశ్వశాంతి మహాయజ్ఞము జరిగినది. తదుపరి ప్రత్యేక పూజలు జరిగాయి. మ. 12-30 ని॥ల నుండి కులమత వ్యత్యాసంలేకుండా అన్నదానము జరగినది. రాత్రికి ప్రఖ్యాత విధ్వాంసులు శ్రీ యస్. పుల్లయ్యగారు, శ్రీ బ్రహ్మం గార్లచే చెక్కభజన జరిగినది. ఈ కార్యక్రమమును భక్తులు ఎంతో ఆనందంతో తిలకించినారు. ఈ కార్యాక్రమము భక్తులను బాగా ఆకట్టుకున్నది.

తేది 29-4-2015 ఉ. 10గం॥లకు శ్రీ గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రుల కళ్యాణము జరిగినది. ఈ కల్యాణమును పూసపాటి నాగేశ్వరాచారి బృందం కనులపండుగా చేయించారు. తదుపరి అన్నదానం జరగినది. సాయంత్రం గం॥7-00లకు శ్రీ గోవిందమాంబవీరబ్రహ్మేంద్రులఉత్సవమూర్తులతో నగరోత్సవం కనుల పండుగగా జరిగినది.

ప్రతి రోజు ఉదయం సుప్రభాతం, కాలజ్ఞాన పారాయణము, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి చరిత్ర పారాయణము, అభిషేకములు జరిగినాయి. ఈ కార్యక్రమమునకు భక్తులు విరివిరిగా పాల్గొన్నారు.

ఆరాధన కల్యాణమహోత్సవములకు ఆర్థికంగాను, హార్థికంగాను సహకరించిన వారందరికి,కార్యక్రమములో పాల్గొన్నవారికి శ్రీ గోవిందామాంబ వీరబ్రహ్మేంద్రుల దివ్యానుగ్రహం సర్వదా సర్వత్ర సంప్రాప్తించాలని ప్రార్థిస్తూ

శ్రీ అచలానందస్వామివారి భక్త బృందము.

**శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి నవమ వార్షికోత్సవ**

# 'గురుపూజా' 'కల్యాణ' మహోత్సవములు

**శ్రీమదచల బ్రహ్మంగారి ఆశ్రమము, కె. నరసాపురం, తాడిపత్రి తాలూకా, అనంతపురం జిల్లా.**

తే॥ 12.06.2015 శుక్రవారం నుండి 14.06.2015 ఆదివారము వరకు



| | | |
|---|---|---|
| 12.06.2015 | ఉ॥ : 11-45ని॥లకు | **శ్రీగోవిందమాంబావీరబ్రహ్మేంద్రుల కల్యాణము** |
| | సా॥3.30 ని॥లకు | **గ్రామోత్సవము,** |
| | రాత్రి 09.30 | **శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి జీవితచరిత్ర నాటకము** |
| 13.06.15 | ఉ॥8గం॥ల నుండి | **అన్నదాన కార్యక్రమము** |
| | ఉ॥9గం॥ల నుండి | **వేదాంతసభ, పెద్దలు, గురువులచే వేదాంతోపన్యాసములు** |
| 14.06.15 | రా. 09.30 గం.లకు | **భజనపోటీలు** |

**ఇట్లు:**

**నిష్కలంక టి. రామకృష్ణప్పాచార్యులు, మరియు భజన బృందము, గ్రామప్రజలు**

కె. నరసాపురం (గ్రా), పెద్దపప్పూరు (మం), తాడిపత్రి (తా) అనంత పురం జిల్లా.

**ఫోన్: 9177023180, 9160244593**